| ఉష్ణోగ్రత (అంచనా) 20-5-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 36 | 27 |
| తెనాలి | 36 | 28 |
| నరసరావుపేట | 35 | 25 |
| బాపట్ల | 35 | 28 |
| రెంటచింతల | 38 | 26 |
| చీరాల | 34 | 26 |



# 1,2.. అంటే పెద్ద పరీక్షే!

- ఇదీ గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భూసార పరీక్షల తీరు..
- ఒక్క ల్యాబ్ ఉన్నా..పల్నాడు జిల్లానే కొద్దిగా మెరుగు
- వేలల్లో మట్టి నమూనాల సేకరణ లక్ష్యం..
- క్షేత్రస్థాయిలో జరుగుతున్నది ఒకటి.. రెండే
- ల్యాబ్‌లలో సిబ్బంది, రసాయనాల కొరత..
- ప్రభుత్వ సూక్ష్మ పోషకాలు కోల్పోవాల్సిందేనా..?



మట్టి నమూనాల పరీక్షలు

**1, 2.. ఇవి పోటీ పరీక్షల్లో విద్యార్థుల ర్యాంకులు కాదు.. వ్యవసాయాధారిత జిల్లాల్లో వ్యవసాయ శాఖ నిర్వహించిన మట్టి నమూనా పరీక్షలు.. మట్టి నమూనాల పరీక్షలు లక్ష్యం ఘనంగా ఉన్నా.. ఆచరణ శూన్యంగా ఉంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా.. ఇప్పటికి 452 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. జిల్లాల వారీగా ఆచరణ సాధ్యం కాని స్థాయిలో మట్టి పరీక్షల టార్గెట్‌లు ఇచ్చిన ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో వసతులు కల్పించ డాన్ని విస్మరించింది. పరీక్షల ల్యాబ్‌లలో రసాయనాలు, పరికరాలు, సిబ్బంది కొరత వెంటాడుతోంది.**

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూసార పరీక్షలు యజ్ఞంలా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆచరణలో వ్యవసాయ శాఖ చతికిల పడింది. మట్టి నమూనాలను టార్గెట్‌ల మేర సేకరిస్తున్నారే తప్పా..ఆ మేరకు పరీక్షలు జరగడం లేదు. రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించినా ఆచరణలో సాధ్యమయ్యే పరిస్థితులు లేవు. వర్షాలు ఈ సారి ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో అన్నదాతలు సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే పంట సాగు నాటికి భూసార పరీక్షలు పూర్తి కావు. పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం.

### భూసార పరీక్షలతో లాభాలు..

భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. సాగు నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. పరీక్షల ఆధారంగా భూమి సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు, మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాలస్థాయి(పీహెచ్)తో పాటు పాస్ఫరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బొరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలు అటకెక్కాయి.



ల్యాబ్‌లో మట్టి పరీక్షలు, పరికరాలు

### గుంటూరు జిల్లాలో ఒకటే..

గుంటూరు జిల్లాలో మట్టి నమూనాల పరీక్షల కోసం మూడు ల్యాబ్‌లు ఉన్నాయి. 13,882 మట్టి నమునాలను పరీక్షించాలనేది లక్ష్యం కాగా ఇప్పటికి 10,269 నమూనాలను సేకరించారు. టార్గెట్‌లో 74.07 శాతం మాత్రమే సేకరణ పూర్తయింది. సేకరించిన నమూనాల్లో ఒకటే నమూనాను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డు సిద్ధం చేశారు. ఈ జిల్లాలో నమూనాల పరీక్షల్లో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. ఈ జిల్లాలో మట్టి నమూనాల పరీక్షలు ఇలా కొనసాగితే ఏడాదికి పూర్తయినా.. పూర్తయినట్లేనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి నమూనాల పరీక్షలు వేగవంతం చేసి వచ్చే జూన్ కన్నా హెల్త్ కార్డులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

### సూక్ష్మపోషకాలు కోల్పోయే పరిస్థితి..

జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు.. వచ్చే సీజన్‌లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూసార పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను నిర్ధారించనున్నారు. ఈ మేరకు సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలానే సాగితే ప్రభుత్వం అందజేయనున్న సూక్ష్మ పోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది.

### పల్నాడులో రోజుకు 100 నమూనాల పరీక్ష..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు జరుగుతున్నాయి. 28 మండలాలకు ఉన్నది ఒక్క ల్యాబే. దీనిలో కూడా సిబ్బంది కొరత నెలకొంది. చిలకలూరిపేటలోని ల్యాబ్‌ను సిబ్బంది, పరికరాల కొరతతో మూసివేశారు. దీంతో జిల్లాలో సేకరించిన మట్టి నమూనాలను నరసరావుపేట ల్యాబ్ లో మాత్రమే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ల్యాబ్‌లో వసతులు లేక మహిళా సిబ్బంది తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అయితే జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. 18,953 మట్టి నమూనాలను సేకరించారు. 80.87 శాతం మట్టి నమూనాల సేకరణ పూర్తి చేశారు. ఇందులో 452 మట్టి నమూనాలను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను సిద్ధం చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో 2.38 శాతం మాత్రమే మట్టి నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. రోజుకు వంద చొప్పున నమూనాల పరీక్షలు చేస్తే ఖరీఫ్ సీజన్ ముగిసే లోపు కూడా భూసార పరీక్షల కార్డులు రైతులకు అందే పరిస్థితి ఉండదు. పల్నాడు జిల్లాలో సేకరించిన మట్టి నమూనాల్లో 50 శాతం గుంటూరు.. బాపట్ల పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు అనుమతి కోరుతూ లేఖ రాసినట్లు జేడీ మురళీ తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాతో పోలిస్తే పల్నాడు జిల్లాలో పరీక్షలు కొంత మెరుగ్గా ఉంది.



నరసరావుపేటలోని భూసార పరీక్షల ల్యాబ్

### బాపట్ల జిల్లాలో రెండు..

బాపట్ల జిల్లాలో మట్టి నమూనాల పరీక్షలకు మూడు ల్యాబ్‌లు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అయితే ల్యాబ్‌లు ఉన్నా నమూనాల పరీక్షల్లో తీవ్ర నిర్లక్ష్యం తాండవిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ జిల్లాలో 22,825 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 14,798 మట్టి నమూనాలను సేకరించారు. 64.83 శాతం మట్టి నమూనాలను సేకరించగా వీటిలో రెండు నమూనాల పరీక్షలు పూర్తి చేసి సాయిల్ హెల్త్ కార్డులు సిద్ధం చేశారు. సిబ్బంది, రసాయనాల కొరత వల్లే మట్టి పరీక్షలు జరగడం లేదన్న వాదనను సదరు అధికారులు వినిపిస్తున్నారు.

## మహిళల పోరాట పటిమకు నిదర్శనం
# అమరావతి ఉద్యమం

- హోం మంత్రి వంగలపూడి అనిత

గుంటూరు(తూర్పు), మే 19(ఆంధ్రజ్యోతి): అమరావతి ఉద్యమం సజీవంగా నిలబడిందంటే కారణం మహిళలేనని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న శ్రీ కన్వెన్షన్‌లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాయపాటి శైలజకు ఘన సత్కారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అనిత మాట్లాడుతూ ఆకుపచ్చ కండువాను ధరించి.. మహిళా రైతులు చేసిన ఉద్యమం భావితరాలకు స్ఫూర్తినింపుతుందన్నారు. వైసీపీ పెట్టిన కేసులకు భయపడకుండా అమరావతి పరిరక్షణకు వారు చేసిన దీక్షలు, పాదయాత్రలు గొప్పవని కొనియాడారు. ఉద్యమంలో ఉంటూ మహిళల కష్ట సుఖాలు దగ్గరగా చూసిన రాయపాటి శైలజకు ఈ పదవి ఇవ్వడం సముచితమన్నారు. మహిళా కమిషన్‌కు హోం శాఖ అండగా ఉంటూ.. మహిళల రక్షణకు కృషి చేస్తుందని చెప్పారు. రాయపాటి శైలజ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికడతామని స్పష్టం చేశారు. అమరావతి ఉద్యమం తనలో స్ఫూర్తి నింపిందని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అమరావతి ఉద్యమంలో రాయపాటి శైలజ చూపిన పోరాట పటిమ స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, పలు కార్పొరేషన్లు, కమిటీల చైర్మన్లు పట్టాభిరామ్, లంకా దినకర్, గొనుగుంట్ల కోటేశ్వరరావు, మన్నవ మోహనకృష్ణ, పిల్లి మాణిక్యరావు, ఆలపాటి సురేష్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, కావలి గ్రీష్మ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, బీజేపీ, జనసేన జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, గాదె వెంకటేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, అమరావతి పరిరక్షణ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న హోంమంత్రి అనిత, పక్కన రాయపాటి శైలజ, వేదికపై ఎమ్మెల్యే పుల్లారావు, వర్ల రామయ్య, కావలి గ్రీష్మ తదితరులు

# పాడి రైతుకు బీమా రక్ష

**సేద్యం నష్టాలను మిగిల్చిన ప్రతిసారీ ఎంతోకొంత పాడి పరిశ్రమే అన్నదాతలను ఆదుకుంటూ వస్తోంది. అంతటి కీలకమైన రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసి.. పాడి రైతుల ప్రయోజనాలకు గండి కొట్టింది. పశువులకు బీమా విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. అటు రైతులూ సొంతంగా బీమా చేసుకోకుండా చేసి.. వారిని నిలువునా వంచించింది. అరకొరగా చేసిన బీమాకు సొమ్ము అందించడానికి ఏళ్ల తరబడి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పింది.. ఈ బాలారిష్టాలను తొలగించి పాడి పరిశ్రమను తిరిగి గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది.**



- రైతులు కట్టే ప్రీమియం వాటా తగ్గింపు
- తొలి విడతలో మూడు జిల్లాలకు రూ.88 లక్షలు విడుదల
- దశల వారీగా నిధుల విడుదలకు కసరత్తు
- రైతులకు పశుసంవర్ధక శాఖ అవగాహన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పశు బీమాపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో బీమా ప్రీమియం వాటా రైతులు చెల్లించాల్సింది 20 శాతం ఉండేది. ఇప్పుడు దానిని 15 శాతానికి తగ్గించి, రైతులకు మరింత మేలు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు.. తొలి విడతలో భాగంగా మూడు జిల్లాలకు ప్రీమియం వాటా తాలూకా నిధులను ప్రభుత్వం విడుదల చేయడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రైతు వాటా 5 శాతం తగ్గింపు..

పశువులకు చెల్లించే బీమా ప్రీమియం సొమ్ములో గతంలో రైతు వాటా 20 శాతంగా ఉండేది. ఇప్పుడు దానిని 15 శాతానికి తగ్గించగా.. మిగిలిన 85 శాతంలో కేంద్రం 60, రాష్ట్రం 40 శాతం భరించే విధంగా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ప్రీమియం వాటాకు సంబంధించి తొలి విడత నిధుల విడుదలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాకు రూ.32 లక్షలు విడుదల కాగా.. 63 శాతం పశుసంవర్ధకశాఖ ఖర్చు చేసింది. పల్నాడు జిల్లాలో రూ.30 లక్షలు, గుంటూరు జిల్లాలో రూ.26 లక్షలు తొలి విడతలో భాగంగా బీమా ప్రీమియం నిధులు విడుదల కాగా.. 70 శాతం ఈ రెండు జిల్లాల పరిధిలో ఇప్పటికే ఖర్చు చేశారు. పశువుకు బీమా రూ.30 వేలుగా ఉంటే.. ప్రీమియం సొమ్ము రూ.1,920గా ఉంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా రూ.1,632 ఉంటే.. రైతు వాటాను రూ.288కే ప్రభుత్వం పరిమితం చేసింది. పశువులకు బీమా రూ.50 వేలు వరకు, గొర్రెలు, మేకలకు రూ.6 వేలు వరకు కల్పించేలా ఆదేశాలు జారీ చేసింది. గతంలో బీమా సౌకర్యం ఐదు పశువులకు మాత్రమే గరిష్ఠంగా ప్రభుత్వం కల్పించేది. దానిని ఇప్పుడు పది వరకు పెంచింది. గొర్రెలు, మేకలకు (మిగతా 6వ పేజీలో)

# మెరుగైన పారిశుధ్యంలో రాజీ లేదు

- విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు
- నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 19( ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించడంలో రాజీ లేదని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర స్పష్టం చేశారు. సోమవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, నోడల్ అధికారులు, విభాగాధిపతులతో పారిశుధ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో ప్రజలకు బాధ్యతాయుతమైన సేవలు అందించడం ప్రభుత్వ ఉద్యోగుల ప్రాథమిక విధి అన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుండి అందే అర్జీలు, సమస్యలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. వీధి కుక్కల నియంత్రణపై నిబంధనలు పాటిస్తూ చర్యలు తీసుకోవాలని, ఇందులో శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికీ కొందరు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పారిశుధ్య పనులు పర్యవేక్షణకు ఒక్కో శానిటరీ డివిజన్‌కు ఇద్దరు నోడల్ అధికారులను, 10 డివిజన్లకు ఒక విభాగాధిపతి, నియోజకవర్గానికి ఒక డిప్యూటీ కమిషనర్‌ను కేటాయించామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం మస్టర్ నుండి సాయంత్రం పని పూర్తయ్యేవరకు నోడల్ అధికారులు పర్యవేక్షణ చేసి నివేదిక ఇస్తారని, ఈ మేరకు చర్యలు కూడా ఉంటాయన్నారు. కార్మికుల హాజరు సచివాలయం పరిధిలోనే కార్యదర్శే తీసుకోవాలని, ముందస్తు అనుమతి లేకుండా సెలవులు తీసుకోవడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సెక్రటరీ బి.శ్రీనివాసరావు, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

# మిర్చియార్డులో అవినీతి ఇలా..

- ప్రభుత్వానికి నివేదించిన విజిలెన్స్
- జీరో బిజినెస్ రూపంలో రూ. 103.74 కోట్లు
- కట్ బిజినెస్ ద్వారా రూ. 243.96 కోట్లు గండి
- కమీషన్, ఎగుమతి వ్యాపారుల టర్నోవర్లు బేరీజు వేసి అంచనా



గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 347.70 కోట్ల అవినీతి జరిగిందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్ధారించి.. అందుకు కొన్ని ఆధారాలను ప్రభుత్వానికి నివేదించింది. ప్రధానంగా జీరో, కట్ బిజినెస్‌ల పైనే విజిలెన్స్ అధికారులు దృష్టి కేంద్రీకరించారు. మిర్చి యార్డులోకి గేట్ ఎంట్రీ ఎన్ని టిక్కీలు జరిగాయి, ఈనామ్‌లో ట్రేడింగ్ జరిగిన టిక్కీల సంఖ్య, మిగతా బ్యాలెన్స్ వంటి వాటిని లెక్కించారు. అలానే కమీషన్ వ్యాపారులు ఐదేళ్లలో ఎంత టర్నోవర్ చేశారు. వీళ్ల వద్ద ఎగుమతి వ్యాపారులు కొనుగోలు చేసిన మిర్చి టర్నోవర్ ఎంత అనే గణాంకాలను కూడా సేకరించారు. వీటిని బేరీజు వేసి వ్యత్యాసాన్ని లెక్కించి.. యార్డు ఆదాయానికి పడిన గండిపై ఒక అంచనాకు వచ్చారు. ఒక శాతం మార్కెట్ ఫీజు రూపంలో మిర్చి యార్డుకు, ఐదు శాతం జీఎస్టీ కోల్పోవడం వల్ల వాణిజ్య పన్నుల శాఖకు పైన పేర్కొన్న నష్టం జరిగిందని నిర్ధారించి, అందుకు బాధ్యులైన 18 మంది అధికారులపై చర్యలకు సిఫార్సు చేసింది.

మిర్చియార్డులో అన్ని పని దినాల్లో ఉదయం 6.30 గంటలకు ట్రేడ్ ప్రారంభమవుతుంది. అయితే అధికారులు, సూపర్‌వైజర్లు, వేమెన్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆ సమయానికి డ్యూటీకి రావడం లేదని విజిలెన్స్ పేర్కొంది. రైతులు తీసుకొచ్చిన మిర్చి టిక్కీలకు లాట్ ఐడీలను ఉదయం 10.30 గంటలకు జనరేట్ చేస్తున్నారు. గతంలో లాట్ ఐడీలు రైతుల విజ్ఞప్తి మేరకు.. కమీషన్ ఏజంట్ల గుమాస్తాల అందించిన వివరాల మేరకు జనరేట్ చేసేవారు. వీటన్నింటి వల్ల జీరో బిజినెస్‌కు అవకాశం పెరుగుతోంది. గేట్ కీపర్లు మాన్యువల్ రికార్డుల్లో ఎంట్రీ చేస్తున్నారు. వాటిని ఈనామ్ ఇన్‌పుట్ డేటాతో చెకింగ్ చేయడం లేదు. విజిలెన్స్ దర్యాప్తులో కొన్ని లాట్ ఐడీలు అసలు బిడ్డింగ్‌లోకే తీసుకురాలేదని తేలింది.

2019-24 మధ్యన 23,94,717 మిర్చి టిక్కీలు బిడ్డింగ్ జరగలేదు. అప్పట్లో మిర్చి క్వింటా రేటు రూ.14 వేల నుంచి రూ.20 వేల మధ్యన ఉంది. దీని వల్ల ఒక శాతం మార్కెట్ ఫీజు రూపంలో రూ. 17,29,07,520 యార్డు ఆదాయానికి గండి పడింది. 5 శాతం జీఎస్టీ రూపంలో రూ.86,45,37,600 వాణిజ్య పన్నుల శాఖ ఆదాయం కోల్పోయింది. ఈ విధంగా చూసుకొంటే జీరో బిజినెస్ ద్వారా మొత్తం రూ.1,03,74,45,120 ఆదాయాన్ని రెండు శాఖలు సంయుక్తంగా కోల్పోయాయి.

వేమెన్‌లు ఎవరైతే నిర్ణీత సమయానికి విధులకు హాజరై కమీషన్ ఏజెంట్‌లు, ట్రేడర్ల గుమాస్తాల నుంచి సేకరించిన డేటా, కాటా వేసిన వివరాలు, కమీషన్ ఏజెంట్‌లు, ట్రేడర్ల టర్నోవర్‌లను కూడా విజిలెన్స్ పరిశీలించింది. మిర్చి యార్డులో 665 మంది కమిషన్ ఏజెంటులున్నారు. వాళ్లందరి ఐదేళ్ల టర్నోవర్ రూ.31,480 కోట్లుగా తేలింది. అలానే 385 ఎక్స్ పోర్టు ట్రేడర్ల ఐదేళ్ల టర్నోవర్ రూ. 27,368 కోట్లుగా నిర్ధారణ జరిగింది. దీంతో వ్యత్యాసం రూ.4,066 కోట్లుగా తేలడంతో దీనిపై ఒక శాతం మార్కెట్ ఫీజు, ఐదు శాతం జీఎస్టీని విజిలెన్స్ లెక్కించింది. కట్ బిజినెస్ వల్ల మార్కెట్ ఫీజు రూపంలో యార్డుకు రూ.40.66 కోట్లు, జీఎస్టీ రూపంలో రూ.203.30 కోట్లు నష్టం జరిగింది. కట్ బిజినెస్ వల్ల రూ. 243.06 కోట్లు, జీరో వ్యాపారం వల్ల రూ. 103.74 కోట్లు కలిపి మొత్తంగా రూ. 347.70 కోట్ల నష్టం జరిగినట్లు నివేదించింది. దీనిపై ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపడుతుందో చూడాలి.

# పాడి రైతుకు 'బీమా' రక్ష

(5వ పేజీ తరువాయి)

వంద వరకు వెసులుబాటు కల్పించింది. ఒక్కసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల పాటు అది అమల్లో ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులన్నీ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రాగా.. ఈ నెల మొదటి వారం నుంచి బీమా ప్రక్రియను యంత్రాంగం ముమ్మరం చేసింది.

**ఎక్కువ శాతం బీమా గొడుకు కిందకు..**

జిల్లా వ్యాప్తంగా ఉన్న పశు సంపదలో దాదాపు 30 శాతం వరకైనా బీమా గొడుకు కిందకు తెచ్చేలా గ్రామాల్లో అవగాహన కల్పించే చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం బాపట్ల జిల్లాలో ఆవులు, ఎద్దుల సంఖ్య 21,930గా ఉండగా, గేదెలు 3,81,764 ఉన్నాయి. గొర్రెలు 4,27,523, మేకలు 49,990, పందులు 3,219 కాగా కోళ్లు 7,76,022 ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఆవుల సంఖ్య 68,000, గేదెలు 4,69,048, గొర్రెలు 4,80,000, మేకలు 1,58,000, పందులు 1,800 నమోదై ఉన్నాయి. గుంటూరు జిల్లాలో గేదెల సంఖ్య 2,20,000 వరకు ఉండగా.. మేకలు, గొర్రెలు కలిపి మూడు లక్షల వరకు ఉన్నాయి. వీటన్నింటికీ బీమా కల్పించేలా పాడి రైతులకు అవగాహన కల్పించడానికి పశు సంవర్ధకశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులను చైతన్య పరుస్తున్నారు

**బకాయిలు చెల్లించి, పాడికి ఊతం**

వైసీపీ ఏలుబడిలో అరకొరగా అమలు చేసిన పాడి సంబంధిత పథకాల బకాయిలను ఈ ప్రభుత్వం చెల్లించింది. బాపట్ల జిల్లాలో రూ.2కోట్ల వరకు పెండింగ్ మొత్తాలను చెల్లించగా గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు రూ.5 కోట్ల వరకు చెల్లించింది.బీమాను ఏడాది పొడవునా ఉధృతంగా అమలు చేసేలా పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గడచిన మూడు నెలల వ్యవధిలో దాదాపు 3శాతం పశు సంపద వృద్ధి.. మూడు జిల్లాల్లో నమోదు కావడం గమనార్హం.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 512.70 అడుగులు ఉంది. ఇది 136.30 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# డిమాండ్ లేకున్నా.. తత్కాల్ కోటానా..!

● ఈ కారణంగా జనరల్, రిమోట్ లొకేషన్, తత్కాల్‌లో కోత ● రైల్వే నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని ప్రయాణికుల సూచన



గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా తిరుపతి, విశాఖపట్టణం, రాయగడ తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న అంతగా డిమాండ్ లేని రైళ్లలో రైల్వే శాఖ తాజాగా ప్రీమియం తత్కాల్ కోటాని జత చేసింది. దీని వలన ఇతర కోటాల్లో కోత పడింది. ఈ నిర్ణయం ఒక విధంగా మేలు చేసేలా ఉన్నా మరో రూపంలో నష్టం కలిగిస్తుంది. తత్కాల్/ప్రీమియం తత్కాల్ కోటాకు టిక్కెట్ల సంఖ్యని పెంచడం వలన జనరల్, రిమోట్ లోకేషన్ కోటాల్లో వాటి సంఖ్య తగ్గించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనివలన ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం జరగదు. కాగా ప్రీమియం తత్కాల్‌లో మిగిలిపోయిన టిక్కెట్లను తత్కాల్ వెయిటింగ్ లిస్టుని క్లియర్ చేయడానికి సర్దుబాటు చేస్తారు. జనరల్ కోటాలకు కూడా సర్దుతారు. ఈ కారణంగా జన రల్/తత్కాల్‌లో వెయిటింగ్ లిస్టులో బుకింగ్ చేసుకొన్న ప్రయాణీకులు ఛార్ట్ సిద్ధమయ్యే సమయం కోసం ఎదురు చూస్తూ గడపాలి.

నంబరు. 20702 తిరుపతి - సికింద్రాబాద్ వందేభా రత్ ఎక్స్‌ప్రెస్‌కి గతంలో జనరల్ కోటాలో ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్(ఈసీ) సీట్లు 44 ఉండేవి. ఇవి తాజాగా సవ రించి 28కి తగ్గించారు. గుంటూరు రిమోటల్ లోకేషన్ లో గతంలో ఎనిమిది ఉండేవి కాస్త ఇప్పుడు రెండు పెరిగి పది అయ్యాయి. తత్కాల్ మాత్రం గతంలో 16 ఉంటే దానిని ఇప్పుడు 21కి పెంచారు. ఏసీ ఛైర్‌కార్ సీట్లు గతంలో 603 జనరల్ కోటాలో ఉంటే ఇప్పుడు 474కి తగ్గించారు. గుంటూరు రిమోట్ లోకేషన్‌లో 120 నుంచి 100కి, తత్కాల్‌ని 158 నుంచి 209కి పెంచారు. రైల్వే శాఖ తీసుకొన్న ఈ నిర్ణయం వలన జనరల్ కోటాకు కోత పడి తత్కాల్‌కి పెరిగింది. ఇదేవిధంగా నంబరు. 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ త్రీటైర్ జనరల్ కోటాని ఏడు నుంచి 15కి పెంచారు. తత్కాల్‌ని కూడా ఎనిమిది నుంచి 20కి పెంపుదల చేశారు. స్లీపర్ క్లాస్‌కు గతంలో ఉన్న 159ని 259కి పెంచారు. తత్కాల్‌ని అయితే ఏకంగా వంద పెంచి 95 నుంచి 195 బెర్తులు చేశారు.

నంబరు. 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉద య్ ఎక్స్‌ప్రెస్‌కు జనరల్ కోటా సీట్లే 100 శాతం బుకింగ్ జరగవు. అలాంటిది ఇప్పుడు కొత్తగా ప్రీమియం తత్కాల్ కోటాని చేర్చారు. ఈ రైలుకు తత్కాల్‌కు గతంలో 100 సీట్లు ఉండేవి వాటిని ఇప్పుడు 70కి తగ్గించి మిగతా 30ని ప్రీమియం తత్కాల్ కోటాలో పెట్టారు. సెకండ్ సిట్టింగ్ సీట్లలో జనరల్‌లో 23 నుంచి 20కి తగ్గించి తత్కాల్ కోటాని ఆరు నుంచి తొమ్మిదికి పెంచారు. నంబరు. 17240 విశాఖపట్టణం - గుంటూ రు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌కు కూడా పెద్దగా డిమాండ్ ఉండదు. అయినప్పటికీ ఈ రైలుకు కూడా ప్రీమియం తత్కాల్ కోట పెట్టి ఏసీ ఛైర్ కార్ 5, సెకండ్ సిట్టింగ్ సీట్లు 20గా నిర్ణయించారు. ప్రీమియం తత్కాల్ కోటా లో పెట్టిన ఐదు ఏసీ ఛైర్‌కార్, 20 సెకండ్ సిట్టింగ్ సీట్లను జనరల్ కోటాలో కోత పెట్టి చేశారు. నంబరు. 22203 విశాఖపట్టణం - సికింద్రాబాద్ వయా గుంటూ రు దరంతో ట్రైవీక్లీ(వారంలో మూడు రోజులు) ఎక్స్‌ప్రెస్‌కి డిమాండ్ చాలా తక్కువగా ఉంటుంది. దీనిని కూడా ప్రీమియం తత్కాల్ కోటాని చేర్చారు. ఏసీ టూటైర్ 20, ఏసీ త్రీటైర్ 50, సెకండ్ సిట్టింగ్ మూడు సీట్లన ప్రీమియం తత్కాల్ కోటాలో పెట్టడం వలన జనరల్ కోటాకు కోత పడింది. కేవలం ఆదాయం పెంచుకోవడానికే రైల్వే శాఖ ఈ విధంగా ప్రీమియం తత్కాల్ కోటాని పైన పేర్కొన్న రైళ్లకు నిర్దేశించిందన్న అభిప్రాయం ప్రయాణీకుల నుంచి వ్యక్తమవుతున్నది. దీని వలన ప్రయాణీకులకు ఒరిగేది ఏమి ఉండదని, ఈ నిర్ణయాన్ని రైల్వే శాఖ సమీక్షించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## భూ సమీకరణకు అంగీకరిస్తే ఈ ఏడాది నుంచే కౌలు

● లింగాపురం రైతులతో ఎమ్మెల్యే ప్రవీణ్



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): రెండవ దఫా రాజధాని అమరావతికి భూ సమీకరణ ద్వారా భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరిస్తే.. ఈ ఏడాది నుండే కౌలు అందజేయడం జరుగుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగాపురంలో గ్రామంలో భూ సమీకరణపై గ్రామ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొని రైతుల వినతులకు సమాదానం ఇచ్చారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్యాకేజీ ప్రకారమే రెండవ దఫా భూ సమీకరణ రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. మూడు గ్రామాలను యూనిట్‌గా రిటర్నబుల్ ప్లాట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన పది గ్రామాల్లో రైతులు భూ సమీకరణకు సుముఖత వ్యక్తం చేశారని.. లింగాపురంతో పాటు అమరావతి, ధరణికోట రైతులు కూడా భూ సమీకరణకు అంగీకరిస్తే ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. తమకు కేటాయించే రిటర్నబుల్ ప్లాట్‌ల సమీపంలోనే ఐటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కౌలు రూ.40వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు న్యాయం చేయాలని, పెన్నా కాలువ వెళ్లే భూములను సమీకరణ ద్వారా తీసుకోవాలని, రిటర్నబుల్ ప్లాట్‌లను మెరక ప్రాంతంలో కేటాయించాలని, చదువుకున్న ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇలా తమ డిమాండ్లను సభ ముందుంచారు. ఎమ్మెల్యే ప్రవీణ్ సమాదానం ఇస్తూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సుమారు 100 ఎకరాలకు చెందిన పలువురు రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను ఎమ్మెల్యేకు అందజేశారు. తహసీల్దారు డానియేలు, ఎంపీడీఓ పార్వతి, సర్వేయర్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ కె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక బోధన పద్ధతులపై అవగాహన అవసరం

● ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ

గుంటూరు (విద్య) మే 19 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులకు పరిశోధన, డేటా విశ్లేషణ, అకడమిక్ రచన, పాలసీ అనుసంధానంతో పాటు ఆధునిక బోధన పద్ధతులపై లోతైన అవగాహన అవసరమని యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ ఫిలాసఫీ ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ పేర్కొన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సౌజన్యంతో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో "ఏ టూ వీక్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ఫర్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ ఆన్ ఎన్‌హ్యాన్సింగ్ మెథడోలాజికల్ ఎక్స్‌పర్టైజ్ అండ్ టెక్నాలజికల్ అడాప్షన్" అనే అంశంపై రెండు వారాల కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్ అండ్ అదర్ ఇండియన్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ముఖ్య అతిథి ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ మాట్లాడుతూ గుణాత్మక, పరిమాణాత్మక పద్ధతులపై శిక్షణతోపాటు కేస్ స్టడీ, ఫీల్డ్ రిసెర్చ్ విధానాలపై మేథడాలజికల్ ట్రైనింగ్ అవసరమన్నారు. ఎన్ఐసీ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎస్ఆర్ ప్రభు, వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆచార్య బాల గణపతి దేవరకొండ

## కేఎల్‌యూ మహిళా లిఫ్టర్లకు పతకాలు



లిఫ్టర్లను సన్మానిస్తున్న కేఎల్‌యూ యాజమాన్యం

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 19 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్, ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్ షిప్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కేఎల్‌యూ మహిళా లిఫ్టర్లు స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్టులో ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. డెహ్రాడూన్‌లో ఆదివారం జరిగిన ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్ 47 కిలోల విభాగంలో ఎం.షానూన్, 84 ప్లస్ విభాగంలో నగం జ్ఞానదివ్య, 84 కిలోల విభాగంలో షేక్ సబీనా స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు. ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్ షిప్ టోర్నీలో 47 కిలోల విభాగంలో మధిర షానూన్ కాంస్యం, 84 ప్లస్ కిలోల విభాగంలో నగం జ్ఞానదివ్య రజతం, 84 కిలోల విభాగంలో షేక్ సబీనా స్వర్ణ పతకాలు సాధించారు. డీన్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, స్పోర్ట్స్ డైరెక్టర్ కాకర్ల హరికిషోర్, ప్రో వీసీలు డాక్టర్ రాజశేఖర్, ప్రసాద్, వెంకట్రామ్, రిజిస్ట్రారు సుబ్బారావు, వీసీ సారథివర్మ వారిని అభినందించారు.

## 42 సవర్ల బంగారం రికవరీ

చిలకలూరిపేట, మే19 (ఆంధ్రజ్యోతి): మండలం పసుమర్రు గ్రామంలో వారం రోజుల కిందట జరిగిన భారీ దొంగతనం కేసును చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఛేదించారు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. యలగాల హనుమాయమ్మ అనే మహిళ ఇంటిలో దొంగతనం జరిగింది. సుమారు రూ.34 లక్షలు విలువ చేసే 42 సవర్ల బంగారు నగలు, సుమారు 60 గ్రాముల వెండి వస్తువులు, రాగి, ఇత్తడి సామగ్రిని దుండగులు చోరీ చేశారు. ఈ నెల 11న కేసు నమోదయింది. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై జి.అనిల్ కుమార్ ఇతర సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చిలకలూరిపేటలోని డైక్ మన్ కాలనీకి చెందిన పేదాల రాముడు, మదర్ థెరిసా కాలనీకి చెందిన బీరా సిద్దు అనే ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. వారి నుంచి దొంగలించిన మొత్తం సొత్తును రికవరీ చేశారు. రాముడుపై చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్లో గతంలో ఒక దొంగతనం కేసు, నరసరావుపేట, బల్లికురవ పోలీస్ స్టేషన్ల లో బైండోవర్ కేసులు ఉన్నాయి. పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఎస్పీ.. సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్సై జి.అనిల్‌కుమార్, ఏఎస్ఐలు డి.రోసిబాబు, జి.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుళ్లు దేవరాజు, శ్రీధర్, కానిస్టేబుళ్లు ఇర్మియా, అశోక్, రత్న కిషోర్, హోంగార్డు మధుబాబులను అభినందించారు.

## మద్యం షాపులో ఘర్షణ: ఇద్దరికి గాయాలు

పొన్నూరుటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ఓ మద్యం షాపులో సోమవారం జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అర్బన్ పోలీసుల కథనం మేరకు.. ఐలాండ్ సెంటర్‌లోని వైన్స్‌లో ముబారక్ నగర్‌కు చెందిన జానీ అనే యువకుడు, షాపు సిబ్బంది శివకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. జానీ సమీపంలోని నూనె బాండీలో పడడంతో కాళ్లు, చేతులు, శరీరంపై కాలిన గాయాలయ్యాయి. శివకు కూడా తీవ్ర గాయాలు కాగా.. ఇద్దరినీ పోలీసులు హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

## నేడు తుళ్లూరు సీఆర్డీఏలో జాబ్ మేళా

తుళ్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి) ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఆర్డీఏ ఆధ్వర్యంలో తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. రాజధాని గ్రామాల యువత కోసం.. 500పైగా ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నాయి. పదవ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్, పూర్తి చేసిన వారికి, భవన నిర్మాణ నైపుణ్యం కలిగిన వారికి ఈ జాబ్ మేళాలో అత్యధిక ఉద్యోగ అవకాశాలు ఉంటాయని కమిషనర్ కన్నబాబు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఒక వేళ తెలియక రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు.. ముందుగా వచ్చి ఫెసిలిటేటర్ వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన ఈఏపీ సెట్

గుంటూరు (విద్య) మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఈఏపీ సెట్ సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. గుంటూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాపట్లలో 2, పల్నాడు జిల్లాలో 5, గుంటూరు జిల్లాలో 15 కేంద్రాలు ఉన్నాయి. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 3,575 మంది విద్యార్థులు హాజర య్యారు. మంగళవారం కూడా ఫార్మసీ, అగ్రికల్చర్ పరీక్ష నిర్వహించనున్నారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయి.

## సర్వేయర్‌ను బెదిరించిన కేసులో
# ఎనిమిదేళ్లుగా కోర్టుకు బోరుగడ్డ గైర్హాజర్

● పిటి వారెంట్‌పై కోర్టులో హాజరు పరిచేందుకు అనంతపురం వెళ్లిన పెదకాకాని పోలీసులు

● ఫిరంగిపురం కేసులో బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : పెదకాకాని మండల సర్వేయర్ చిరుమామిళ్ల మల్లికార్జునరావును సర్వే సర్టిఫికెట్ కోసం బెదిరించి, ఆయన విధులకు ఆటంకం కలిగించిన కేసులో నిందితుడైన రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ గడిచిన 8 ఏళ్లుగా కోర్టుకు గై ర్హాజరవుతున్నాడు. ప్రస్తుతం రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ అనంతపురం జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్నాడు. ఆయనకు అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో నమోదైన కేసుల్లో బెయిల్స్ మంజూరయ్యాయి. అయితే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను దూషించి, వారిపట్ల అనుచితంగా వ్యాఖ్యాలు చేసిన ఘటనపై ఫిరంగిపురం పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో ఆయనను ఇటీవల పిటి వారెంట్‌పై నరసరావుపేట కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. దీంతో ఆయన అనంతపురం జిల్లా జైల్లోనే రిమాండ్‌లో కొనసాగుతున్నారు. ఫిరంగిపురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో బోరుగడ్డ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై నరసరావుపేట కోర్టులో వాదనలు ముగిశాయి. మంగళవారం కోర్టు బెయిల్ పిటిషన్‌పై తగు ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇదిలా ఉంటే 2016 మే 9న పెదకాకాని మండల తహసిల్దార్ చిరుమామిళ్ల మల్లికార్జునరావును బెదిరించిన ఘటనపై పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 139/2016 గా కేసు నమోదయింది. పెదకాకాని మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామంలో సర్వేనెంబర్ 47/1 లో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ 3.50 సెంట్ల స్థలాన్ని శాంసింగ్ నుంచి కొనుగోలు చేశారు. ఆ స్థలానికి సర్వే చేసి వెంటనే తనకు సర్వే సర్టిఫికెట్ ఇవ్వాలని సర్వేయర్ మల్లికార్జునరావు పై ఒత్తిడి చేశాడు. అయితే మీ సేవ ద్వారా మాత్రమే సర్వేకు దరఖాస్తు చేసుకోవాలని సర్వేయర్ సూచించారు. దీంతో రెచ్చిపోయిన బోరుగడ్డ సర్వేయర్‌ను బెదిరించి దూషించడమే కాకుండా ఆయన విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై అప్పట్లో సర్వేయర్ మల్లికార్జునరావు పెదకాకాని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు 353, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ కేసులో నిందితుడైన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ గడిచిన 8 ఏళ్ళుగా కోర్టు విచారణకు గైర్హాజరవుతున్నాడు. దీనిపై కోర్టు బోరుగడ్డకు వారంట్ జారీ చేసింది. ఆ కేసులో వారెంట్ పెండింగ్లో ఉండడంతో ఆయనను పెదకాకాని పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి కోర్టులో హాజరు పరిచేందుకు సోమవారం అనంతపురం వెళ్లారు. మంగళవారం రౌడీషీటర్ బోరుగడ్డను గుంటూరు కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉంది. ఈ క్రమంలో రౌడీషీటర్ బోరుగడ్డ మరికొంత కాలం జైలులోనే ఉండక తప్పని పరిస్థితి నెలకొంది.

## బొలెరో ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి



మృతుడు కుందూరు బ్రహ్మయ్య

తాడేపల్లి (ఉండవల్లి), మే 19 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి - పెనుమాక మార్గ మధ్యలో ఉండవల్లి గుహలకు సమీపంలో అతి వేగంతో వెళ్తున్న బొలెరో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలను, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న పెనుమాకకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కుందూరు బ్రహ్మయ్య (60) మృతి చెందగా.. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. బొలెరో డ్రైవర్ మల్కాపురానికి చెందిన నరేష్ మద్యం మత్తులో ఉండటం వల్లే ఈ ఘటన జరిగిందని తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజ్ తెలిపారు. బ్రహ్మయ్యకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. బ్రహ్మయ్య మృతి పట్ల టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు నాయకులు సంతాపం తెలిపారు.

## విత్తన ఉత్పత్తి వృద్ధికి సీడ్ హబ్ సెంటర్లు



సమావేశంలో పాల్గొన్న సీడ్స్ కార్పొరేషన్ ప్రతినిధులు, విస్తరణ సంచాలకులు, శాస్త్రవేత్తలు

లాంఫాం(తాడికొండ)మే 19(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తన ఉత్పత్తిని మరింత పెంచుకునేందుకు సీడ్ హబ్ సెంటర్లు పెంచడం జరిగిందని పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం లాం ఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26లో చేపట్టాల్సిన రాష్ట్ర స్థాయి సాంకేతిక ప్రణాళిక, విత్తనాలకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడ్ హబ్‌లో భాగంగా మరన్ని పంటలు, నూనె గింజల్లో ఆముదము, వలిసెలు చేర్చడం జరిగిందని తెలిపారు. ట్రూత్ ఫుల్లీ లేబుల్ విత్తనాన్ని వీలైనంత వరకు తగ్గించి ధ్రువీకరణ, పునాది విత్తనాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేయాల్సిన అవసం ఉందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విశ్వ విద్యాలయం వివిధ వ్యవసాయ పరిశోధన స్థానాల నుంచి వివిధ సంస్థలకు విత్తనాల సరఫరా, అమ్మకాలు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. విత్తన సంచాలకులు డాక్టర్ కె.రాధిక మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఈ సంవత్సరం నుంచి ఏక్రిప్ ఆన్ సీడ్స్ అనే పథకం గుంటూరుకు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా విత్తనాలకు సంబంధించిన పరిశోధనలు మరింత ముందుకు తీసుకువెళ్లడానికి అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, ఏపీ విత్తన ధృవీకరణ సంస్థ సంచాలకులు డాక్టర్ వై.సతీష్, వ్యవసాయశాఖ, నేషనల్ సీడ్స్ కార్పొరేషన్, సీడ్ మాన్ అసోసియేషన్ ప్రతినిధులు, డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ, డాక్టర్ ఎల్.వీ.సుబ్బారావు, కేవీకే పరిశోధన సంస్థల అధిపతులు, మాజీ ఐఐఆర్ఆర్ హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 248.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 258.00 |

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

## ప్రజా సమస్యల అర్జీలను బాధ్యతగా పరిష్కరించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను అధికారులు బాధ్యతగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిష నర్ ద్వారా ప్రజల నుంచి అందిన 24 ఫిర్యాదులు తీసుకొని, అధికారు లతో మాట్లాడారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి తీసుకొన్న అర్జీలను పరిష్క రించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించి న పీజీ ఆర్ఎస్‌కు 40 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 23, ఇంజినీరింగ్ విభాగం 5, రెవెన్యూ విభాగం 9, ప్రజారోగ్య విభాగం 3 ఫిర్యాదులు అందాయని చెప్పారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సీఎంహోహెచ్ డాక్టర్ అమృతం, డీసీపీ సూరజ్, ఉపా సెల్ పీవో రామారావు, మేనేజర్ బాలాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

### పార్కుల్లో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలి

నగరపాలక సంస్థ పరిధిలోని పార్కుల్లో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ శ్యామలానగర్, చౌడవరం, పొత్తూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పార్కుల్లో నూతనంగా చేట్టాల్సిన అభివృద్ధి పనులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలన్నారు. శ్యామలానగర్ పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్‌ల మరమ్మతులను టెండర్ ఓపెన్ కాగానే పనులు చేపట్టాలని డీఈఈని ఆదే శించారు. పార్కుల్లో పచ్చదనం పెంపునకు ఉద్యాన విభాగ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అన్న క్యాంటీన్లలో ప్రతి రోజు నిర్దేశిత సమయంలోనే ఆహారం అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందికి స్పష్టం చేశారు. సోమవారం చుట్టుగుంట సెంటర్లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు.

## ఉత్తమ వైద్యులుగా సేవలందించాలి

● ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ చంద్రశేఖర్




మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

గుంటూరు (విద్య) మే 19 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి వైద్య విద్యార్థి అందిపుచ్చుకుని సమాజంలో ఉన్నతమైన వైద్యులుగా సేవలందిం చాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపల్ హరిబాబు అధ్యక్షత వహించారు. డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ భాష్యం మెడెక్స్ నుంచి వందలాది మంది విద్యార్థులు ప్రతిష్ఠాత్మక ఎయిమ్స్, జిప్మర్ వంటి సంస్థల్లో సీట్లు సాధించి వైద్య విద్యనభ్యసించడం ముదావ హమన్నారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం మెడెక్స్ ద్వారా ఎంతో మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించి.. దేశ వి దేశాల్లో ఉత్తమ వైద్యులుగా రాణించడం ఒక గురువుగా తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ పి.చంద్రశేఖర్‌ని చైర్మన్ రామకృష్ణ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 300 మంది వైద్య విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


## వ్యాధి నిరోధక టీకాల అమల్లో కొత్త నిబంధనలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి



ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జారీ చేసిన కొత్త మ్యాన్యువల్‌ను అనుసరించి జిల్లాలో గర్భిణులకు, ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాల కార్యక్రమం సమర్థవంతంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి ఆదేశించారు. సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం 2025-26 కొత్త మాన్యువల్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, ప్రభుత్వాస్పత్రుల వైద్యాధికారులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల కు, అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా కొత్త మ్యాన్యువల్‌ను అనుసరించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు చేయాలని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, ప్రపంచ ఆరోగ్య సంస్థ పోలియో సర్వెలెన్స్ వైద్యాధికారి డాక్టర్ భవానీ మాట్లాడుతూ సవరించిన టీకాల కార్యక్రమం అమలు ప్రకారం పలు రకాల ఫార్మేట్లు, ప్రణాళిక తయారీ, అమలు తదితర అంశాలను సూక్ష్మస్థాయిలో వివరించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళ, బుధవారాల్లో కూడా కొన సాగుతాయి.



ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన రాయపాటి శైలజకు శుభాకాంక్షలు తెలుపుతున్న భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, భాష్యం హనుమంతరావు, తెలుగు యువత నేత మన్నెం శివనాగమల్లేశ్వరరావు

## అద్దెకు ఆర్టీసీ స్థలాలు

● 22న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం

గుంటూరు, మే 19(ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ స్థలాలను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఆర్టీసీ యంత్రాంగం సిద్ధమైంది. విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌ల పరిధిలో నిరుపయోగంగా ఉన్న స్థలాలను అద్దెకు ఇచ్చేం దుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని పెదకాకాని, తెనాలి, పెదనందిపాడు బస్టాండ్ ఆవరణల్లో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను వ్యాపారం నిమిత్తం అద్దెకు ఇచ్చేం దుకు నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం రవికాంత్ సోమవారం తెలిపారు. ఇప్పటికే గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ ఆవరణలోనే ఖాళీగా ఉన్న స్థలాలతో పాటు దుకాణాలను కూడా అద్దె ప్రతిపాదిన వ్యాపారులకు ఇచ్చారు. కాగా ఈనెల 22న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు ఏపీఎస్ఆర్‌టీసీ వెబ్‌సైట్‌లో కూడా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

## సంతృప్తి స్థాయిని పెంచాలి

● ఇన్‌చార్జ్ కలెక్టర్ జేసీ భార్గవ్‌తేజ

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 190 అర్జీలు




అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్, జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ

గుంటూరు(తూర్పు), మే 19 (ఆంధ్రజ్యోతి): 24, 48 గంటల్లో గడుపు ముగిసే పిటిష న్లు పెండింగ్‌లో ఉన్నందున జిల్లాలో సంతృప్తి స్థాయి తగ్గిపోయిందని, పెండింగ్‌లో ఉన్న ఐసీడీఎస్, టిడ్కో, డీఆర్డీఏలో అర్జీలను పరిష్కరించి సంతృప్తి స్థాయిని పెంచాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 190 అర్జీలు వచ్చాయి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మికుమారి, ఎం. గంగరాజు, డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, స్టెప్ సీఈవో చంద్రమునితో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డ్వామా, డీఆర్డీఏ, హౌసింగ్ పీడీలు విజయలక్ష్మి, శంకర్, ప్రసాదు, డీపీవో నాగసాయికుమార్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, డీటీసీ కే.సీతారామిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్ర పాల్గొన్నారు.

### కారు స్టాండ్‌ను తొలగించాలని బెదిరిస్తున్నారు

గుంటూరు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న టాక్సీ స్టాండ్‌ను తొలగించాలని ఐలా శ్రీను అనే వ్యక్తి బెదిరిస్తున్నాడని ఆర్టీసీ బస్టాండ్ టాక్సీస్టాండ్ సంక్షేమ సంఘసభ్యులు అర్జీ అందజేశారు. ఇటీవల సైకిల్‌స్టాండ్ నిర్వహించేందుకు ఐలా శ్రీను అనే వ్యక్తి వచ్చాడని, అప్పటి నుంచి టాక్సీస్టాండ్‌ను తొలగించాలని బెదిరింపులకు దిగుతు న్నాడని వాపోయారు. వినతిపత్రం అందించిన వారిలో హబీబ్, అజీజ్, ఇమ్రాన్, హమీద్, ఆసిఫ్ ఉన్నారు.

### పశ్చిమలో ఈద్గాలు, ఖబరస్తాన్ ఏర్పాటు చేయాలి

గుంటూరు, పశ్చిమ నియోజకవర్గంలో ఈద్గాలు, ఖబరస్తాన్‌లను ఏర్పాటు చేయాలని మసీదు ముతవల్లి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అర్జీ అందజేశారు. ఈద్గాలు, ఖబరస్తాన్ లేకపోవడంతో పశ్చిమ ముస్లింలు, తూర్పు నియోజకవర్గంపై ఆధారపడుతున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ సాహెబ్ ఉన్నారు.

### రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు....

ఉద్దేశపూర్వకంగా కొంత మంది రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని మేడికొండూరు కి చెందిన గ్రామస్థులు అర్జీ అందజేశారు. మేడికొండూరు నుంచి తాళ్లూరు మీదగా నరస రావుపేటకు వెళ్లే రహదారి నిర్మాణానికి పొలాలు ఇచ్చామని, ఇద్దరు మాత్రం పొలం ఇవ్వకుండా, పైగా టెండర్‌లో లేకపోయిన ప్రహరీ నిర్మించారని తెలిపారు. అంతేగాక రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసులు పెడుతున్నారని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బోట్ల రామకృష్ణ, ప్రతాప్, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

## ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు అధిగమించాలి

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ప్రతివారం నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకొని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన హౌసింగ్ ఇళ్ల లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం, రైస్ కార్డులు, ఉపాధి హామీ పథకం పనులపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్లలో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణాల పురోగతి లేదని, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని హౌసింగ్ ఏఈలను సమన్వయం చేసుకొని సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎమినిటీస్ సెక్రటరీల ద్వారా ప్రతిరోజు పర్య వేక్షించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లేబర్ సమీకరణ లక్ష్యాలను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి, పీడీ హౌసింగ్ ప్రసాద్, స్టెప్ సీఈవో ఆర్ చంద్రముని, పీడీ ఐసీడీఎస్ విజయలక్ష్మి, పీడీ డ్వామా వీ శంకర్, సీపీవో శేషశ్రీ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

## యోగా దినోత్సవంలో లక్షలాది మంది పాల్గొనాలి

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా, గ్రామ స్థాయి వరకూ జరిగే యోగా దినోత్సవ కార్యక్రమంలో లక్షల మంది ప్రజలు భాగస్వాములయ్యేలా చైతన్యపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయనంద్ ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన అంత ర్జాతీయ యోగా దినోత్సవం, వివిధ ప్రాజెక్టులకు సంబంధించి స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్, అన్ని కోర్టు కాంప్లెక్సుల్లో మరుగుదొడ్ల నిర్మాణం తదితర అంశాలపై సంబంధిత శాఖల కార్యదర్శులు, కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ గురించి మాట్లాడుతూ 50 కోట్ల రూపాయలు పైబడిన ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, క్లియరెన్సులు తదితర అంశాలను ఈ గ్రూప్ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఇది తొలి సమావేశమని, ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలక్టరేట్ నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి, స్టెప్ సీఈవో ఆర్ చంద్రముని, సీపీవో శేషశ్రీ, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), మే 19 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల కోసం పుచ్చలపల్లి సుందరయ్య చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు. సోమవారం బ్రాడీపేట, సీపీఎం జిల్లా కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు ఎండీ అక్బర్, వేణుగోపాలరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం మతోన్మాదులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు వామ పక్షవాదులంతా ఐక్యంగా కృషి చేయటమే సుందరయ్యకు అర్పించే నివాళులని తెలిపారు. కార్యక్రమంలో కే నళినికాంత్, లక్ష్మణరావు, చిష్టి, సుధాకిరణ్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

### వైభవంగా పుష్పయాగం

గుంటూరు(తూర్పు), మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంటూరు, శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామికి ప్రభాత సేవ ఆలయం ప్రదక్షిణలు మంత్ర పుష్పం తీర్థ గోష్టి జరిగింది. అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు రామనామ సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివ రావు, సభ్యులు పర్యవేక్షించారు.

### ఆంజనేయ స్వామికి తులసి దళాలతో పూజ

గుంటూరు కార్పొరేషన్, మే 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని శ్రీఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష తులసి దళాలతో ప్రత్యేక పూజ జరిపించారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ టి.సుభద్ర పర్యవేక్షణలో హనుమాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీహనుమాన్ దీక్షా సమాజం అధ్యక్షుడు తిరువళ్లూరు వెంకట సుబ్బారావు, సభ్యులు నాగేశ్వరరా వు, వంశీప్రసాద్ పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మా కుమార్తె మృతి

● చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

● ఎస్పీ కార్యాలయంలో తల్లిదండ్రుల ఫిర్యాదు

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె లాస్య(16) మృతి చెందిందని తల్లిదండ్రులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పదో తరగతి చదువుతున్న తమ కుమార్తె లాస్యకు గత నెల 9న రాత్రి 3 గంటల సమయంలో ఫిట్స్ రావడంతో హుటాహుటిన కొత్తపేటలోని ప్రముఖ ఆసుపత్రికి తీసుకెళ్లామని తండ్రి కళ్యాణ్ తెలిపారు. రెండు గంటల తరువాత తమ కుమార్తెను వారికి సంబంధించిన మరో ఆసుపత్రికి తరలించారన్నారు. ఆసుపత్రిలో తమ కుమార్తెను వైద్యురాలు పరీక్షించి 48 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచాలని చెప్పిందన్నారు. అయితే 10వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో ఆ వైద్యురాలు ఇన్ఫెక్షన్ సోకడం వల్ల పరిస్థితి విషమంగా మారిందని చెప్పిందన్నారు. దీంతో హైదరాబాదులోని ప్రముఖ ఆస్పత్రికి తీసుకువెళ్తామని, వెంటనే డిశ్చార్జ్ చేయాల ని 10వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకు కోరగా, రాత్రి 9:30 గం టలకు డిశ్చార్జ్ చేశారన్నారు.

దీంతో ఆమెను హుటాహుటీన అంబులెన్స్‌లో హైదరాబాదులోని ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా ఆస్పత్రి సమీపానికి వెళ్లేస రికే ప్రాణం పోయిందన్నారు. గుంటూరులోని వైద్యులు లాస్య చనిపోయిన తర్వాత ఆమెకు క్రిప్టోకోకస్ అనే ఇన్ఫెక్షన్ సోకినట్లు గుర్తించారన్నారు. సకా లంలో వ్యాధిని గుర్తించకపోవడం, వ్యాధి తెలియకుండానే ఓవర్ డోస్ మందులు వాడడం, చివరకు సకాలంలో డిశ్చార్జి చేయక పోవడం వంటి అనేక కారణాల వల్ల తమ కుమార్తె చనిపోయిందన్నారు. కేవలం వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృత్యువాత పడిందన్నారు. తమ కుమార్తె మరణంపై విచారణ జరిపి చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కళ్యాణ్ కోరారు.

### టిడ్కో ఇల్లు ఇప్పిస్తానని వలంటీర్ మోసం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తమకు టిడ్కో ఇల్లు ఇప్పిస్తామని వలంటీర్ విజయ లక్ష్మి తమ దగ్గర ఐదు లక్షల డబ్బులు తీసుకుని మోసం చేసిందని స్వర్ణ భారతినగర్ ఆరోలైన్‌కి చెందిన కట్టా శివపార్వతి, ఆమె బంధువైన ఏడో లైన్‌కు చెందిన శ్యామ్‌కు మార్ సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. పల్నాడు ప్రాంతానికి చెందిన తాము స్వర్ణ భారతినగర్‌లో అద్దెకు నివాసం ఉంటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇల్లు మంజూరు కాకపోవడంతో తమ డబ్బు తమకు ఇవ్వా లని అడుగుతుంటే అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చిందన్నారు. తమలాగే సుమారు 10 మందిని ఇదేవిధంగా టిడ్కో ఇల్లు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని మోసం చేసిందని బాధితులు వాపోయారు.

### ఉద్యోగాలు ఇస్తామని డబ్బులు తీసుకుని...

బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బు లు తీసుకుని మోసం చేశాడని ఆర్టీసీ కాలనీకి చెందిన సయ్యద్‌ఖాజా సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తనకు ఏకే టెక్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ నిర్వహించే అశోక్‌కుమార్ పరిచయమయ్యాడని ఖాజా తెలిపారు. అయితే బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పాడు అన్నారు. దీంతో నిజమేనని తనకు తెలిసిన ఆసిఫ్, వినీత్, నాగ కళ్యాణి, సాయి దినేష్ అనే నలుగురి నుంచి రూ.7 లక్షల 40 వేలు ఇప్పించానన్నారు. మల్టీ లెవెల్ కార్పొరేషన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఉన్నాయని ఇప్పిస్తానంటూ కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. చివరకు మోసపోయానని తెలుసుకుని డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నాడని అన్నారు.

### ఆస్థి వివాదంలో అన్నపై తమ్ముడు దాడి

వసంతారాయపురంకు చెందిన జమిళ్లమూడి గురవయ్యకి అతని తమ్ముడు అయిన నాగరాజుకి మధ్య వారి తండ్రి ద్వారా సంక్రమించిన స్థలం పంచుకొనే విషయమై కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. నాగరాజు అనేకసార్లు మద్యం తాగి గొడ్డలి తీసుకొని గురవయ్య ఇంటి మీదకి వచ్చి గొడవ చేసేవాడు. ఈ క్రమంలో 18న సాయంత్రం నాగరాజు గురవయ్య ఇంటి మీదకి వచ్చి దాడికి పాల్పడ్డాడు. గురవయ్యను, అతని భార్యని దుర్భాషలాడి, ఇనుప రోలింగ్‌తో తలపై కొట్టి గాయపరిచినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ సోమవారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాత గుంటూరులో ఓ ప్రాంతానికి చెందిన మహిళపై అదే ప్రాంతానికి చెందిన షేక్ రియాజ్ కొడుకు సబాజ్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మరుసటి రోజు బంధువులతో వచ్చి ఈ విషయం బయటికి చెప్తే కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పాత గుంటూరు సీఐ సోమయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నగరంలో భారీ వర్షం

● ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం

● కంకరగుంట, 3 వంతెనల వద్ద రాకపోకలకు అంతరాయం

గుంటూరు కార్పొరేషన్, మే 19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన



టీజేపీఎస్ కళాశాల ఎదురు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



దొంక రోడ్డు మూడు వంతెనల వద్ద నిలిచిన వర్షపు నీటిలో వాహనదారుల ఇబ్బందులు

అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి.. సోమవారం గుంటూరు నగరంలో భారీ వర్షం కురవడంతో రోడ్లు, పల్లపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. నగరంలో కంకరగుంట, 3 వంతెనల వద్ద భారీగా వర్షపు నీరు రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు, చిరువ్యాపారులు వర్షంతో తీవ్ర ఇబ్బందిపడ్డారు. నగరంలోని రింగ్ రోడ్డులో గల అన్ని ప్రధాన రహదారులపై వర్షపు నీరు చేరింది.





సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ నాని, ఎమ్మెల్యే నసీర్

## మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే నసీర్

● రూ.2.67 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కా రం చూపే దిశగా అడుగులు వేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సోమవారం రూ.2.67 కోట్లతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి మేయర్ కోవెలమూడి నాని, ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.58.50 లక్షలతో హిమని సెంటర్ నుంచి బండ్ల బజార్ వరకు, రూ.97 లక్షలతో హుడా రోడ్డులో సైడ్ డ్రెయిన్, రూ.34 లక్షలతో కొబ్బరి కాయల సాంబయ్య కాలనీ ఒకటో లైన్ నుంచి ఆరో లైన్ వరకు పైప్‌లైన్స్ రూ.18.47 లక్షలతో రాఫ్‌నగర్ క్రాస్ రోడ్‌లో పైపులైను, సీసీ డ్రెయిన్, రూ.60లక్షలతో జానీ స్వరాజ్ నగర్‌లో పనులు చేపట్టేందుకు ఆయన శంకుస్థాపన చేశారు. వర్షాకాలం రానున్న నేప థ్యంలో మురుగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బండ్ల బజార్ ప్రాంతాల్లో వ్యాపార వర్గాలు ఎక్కువగా ఉంటారని, ఈ క్రమంలో మురుగునీరు నిల్వ లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, డివిజన్ అధ్యక్షులు సలీం, బ్రహ్మస్వామి శ్రీనివాసరావు కార్పొరేటర్ శంకూరి శ్రీనివాస్, చల్లా ఆంజనేయప్రసాద్, గాలి సతీష్‌బాబు, జానీ, విజయ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

### మూడు వంతెనల పరిశీలన

వర్షం కారణంగా మూడు వంతెనల వద్ద నీరు నిల్వ ఉండడంతో ఎమ్మెల్యే నసీర్ ఆ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. మురుగునీరు నిల్వకు గల కారణాలపై ఆరా తీశారు. రాబోయే రోజుల్లో ఈ సమస్య మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### వచ్చే ఏడాది కల్లా విజయవాడలో హజ్ భవన్

వచ్చే ఏడాది కల్లా విజయవాడలో హజ్ భవన్ నిర్మాణం పూర్తి చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌కు బయలుదేరిన హజ్ యాత్రికులకు ఆయన వీడ్కోలు పలికా రు. రైల్వే అధికారులు ప్లాట్‌ఫాంపై పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ వాళ్లతో కలిసి నమాజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజ యవాడలో హజ్‌భవన్ నిర్మాణం పూర్తి చేసి వచ్చే ఏడాది ఇక్కడి నుంచే యాత్రికులను హజ్‌కు పంపుతామన్నారు.

## పశ్చిమ మినీ మహానాడును జయప్రదం చేయాలి

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మే 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆమె పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. తొలుత ప్రజాదర్బార్‌లో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు అతి పెద్ద పండుగ మహానాడు అని, దీనిలో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మినీ మహానాడును ఘనంగా నిర్వహించనున్నామని మాధవి తెలిపారు. దీనికి నియోజకవర్గం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

## వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

● డాక్టర్ శనక్కాయల రాజకుమారి

గుంటూరు మెడికల్, మే 19 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో గర్భిణులు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలని శనక్కాయల రాజకుమారి సూచించారు. అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని స్వర్ణ భారతీనగర్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులను ఉద్దేశించి డాక్టర్ రాజకుమా రి మాట్లాడుతూ ఈ వేసవిలో గర్భిణులు, బాలింతలు బలవర్ధక ఆహారం తీసుకోవాలని తెలిపారు. సుఖ ప్రసవం కోసం పాటించాల్సిన జాగ్రత్తలు, వ్యాయామాలను ఆమె వివరించారు. అనంతరం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 250 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్లు శిరీష, హేమ, 56వ డివిజన్ కార్పొరేటర్ పద్మజ, అహల్యా నర్సింగ్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న డాక్టర్ రాజకుమారి

## చలో విజయవాడను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికై జూన్ 5న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఉద్యోగ సమ స్యలే ప్రధాన అజెండాగా నిర్వహిస్తున్న సభకు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. సమావేశానికి ముఖ్యమంత్రిని ఆహ్వా నించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో పోతురాజు, కరీముల్లా షాఖాదరి, విజయబాబు, లక్ష్మీనారాయణ, అరుణకుమారి, రోజా, పద్మజ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీ మించి అమ్మితే చర్యలు తప్పవు : మాధురి

గుంటూరు(తూర్పు), మే 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణదారులు ఎమ్మార్పీ మించి అమ్మితే చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎన్ఎస్ మాధురి స్పష్టం చేశారు. మెట్రాలజీ డే కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లో వినియోగదారులకు, వర్తక సంఘాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కాలపరిమితి ముగిసిన వస్తువులను దుకాణాల్లో ఉంచవద్దని స్పష్టం చేశారు. ప్యాకింగ్ ఫుడ్‌పై వివరాలను ముద్రించాలని అన్నారు. కార్గో సేవల్లో వినియోగించే కాటాను ప్రతి ఏడాది ధ్రువీకరించాలని అన్నారు. డిప్యూటీ కంట్రోలర్ షాలమ్‌రాజు, ఇన్‌స్పెక్టర్లు సునీల్ రాజా, వర్తక సంఘాలు, దుకాణదారులు పాల్గొన్నారు.



స్వర్ణ వెంకటేశ్వరస్వామి

# నేటి నుంచి.. హనుమత్ జయంతి ఉత్సవాలు

- పొన్నూరు విచ్చేయనున్న దీక్ష పరులు
- ఉత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

పొన్నూరుటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి) : పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన వీరాంజనేయ స్వామి ఆలయం హనుమత్ జయంతి ఉత్సవాలకు ముస్తాబయింది. ఇక్కడి శ్రీ వీరాంజనేయ స్వామిని ఏక శిలా రూపంలో 1969లో ప్రతిష్ఠించారు. 24 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పు ఉన్న శ్రీ వీరాంజనేయ శిల్పాన్ని అద్భుత కళా నైపుణ్యంలో రూపొందించడమే కాకుండా గోష్ఠీవనాన్ని వ్యయ ప్రయాలకు ఓర్చి తరలించి ప్రతిష్ఠించారు. ఈ భారీ వీరాంజనేయ స్వామిని , వీక్షించి పూజించేందుకు ప్రతి ఏటా జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి హనుమత్ దీక్షా పరులు పెద్ద ఎత్తున తరలి వస్తారు. అంతే కాకుండా ఈ ఆలయంలోనే కొలువు దీరిన మహా వీర గరుత్మంత స్వామి విగ్రహం, 30 అడుగల ఎత్తుతో, 15 అడుగుల వెడల్పుతో భక్తులను ఆకర్షిసుంది. ఐదెకరాల సువిశాల ప్రాంగణంలో కొలువు దీరిన మరో ఆలయం సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్ లింగరూపంలోనూ మరో వైపు విగ్రహ రూపంలోనూ భక్తులు దర్శించుకోవచ్చు, అంతే కాకుండా 1108 శివలింగాలు నిరంతరం భక్తుల పూజలు అందుకుంటున్నాయి. అలాగే దశావతారాల ఆలయం, సర్వపాప విమోచన కర కాలభైరవ స్వామి ఆలయం, వంటి ఎన్నో విశిష్టతలు కలిగిన ఉపాలయాలతో పాటు 5 అఖండ జ్యోతుల మందిరాల సైతం ఈ ఆలయంలోనే భక్తుల పూజలు అందుకుంటున్నాయి. నేడు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలకు అంకురార్పణ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 21, 22 తేదీలలో తెల్లవారుజామున వీరాంజనేయ స్వామి వారి విగ్రహానికి మంత్ర జలాలు, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. హనుమత్ జయంతి రోజున స్వామి వారికి ప్రీతికరమైన నాగవల్లి దళాలు(తమలపాకులు), లక్ష మల్లెల పూజలు, శ్రీ సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఆలయంలో ఏర్పాట్లు జరిగాయి.



ఏకశిల వీరాంజనేయ స్వామి

# ఎమినిటీస్ సెక్రెటరీలు ఎక్కడ?

- చాలామంది దీర్ఘకాలిక సెలవులోకి
- అనుమతి లేకుండానే కొందరు గైర్హాజరు
- 2ఏళ్ల తర్వాత వచ్చినా జాయినింగ్ ఆర్డర్స్

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో ఎమినిటీస్ సెక్రెటరీలుగా నియమితులైన ఇంజనీరింగ్ పట్టభద్రులు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోతున్నారు. ఇప్పటివరకు వాళ్లకు సక్రమంగా ప్రమోషన్ ఛానల్ డిజైన్ కాకపోవడం, జీతాలు చూడబోతే రూ. 30 వేలకు కొంచెం అటుఇటుగానే నెలకు వస్తుండటంతో ఎమినిటీస్ సెక్రెటరీలుగా కొనసాగలేకపోతున్నారు. ఇక్కడ అధికారులు, కార్పొరేటర్లు/కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తగిన గౌరవం కూడా ఇవ్వకపోతుండటంతో వేరే దారి వెతుక్కుంటున్నారు. కొందరైతే ఇప్పటికే విదేశాలకు వెళ్లిపోయి అక్కడ ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగాలు తెచ్చుకొని ఆయా దేశాల్లో కొనసాగుతున్నారు. మరికొందరు హైదరాబాద్/బెంగళూరు/చెన్నైలోని ఐటీ కంపెనీల్లో మంచి ప్యాకేజీ ఉద్యోగాల్లో చేరారు. ఇంకొందరు ఏపీసీఆర్‌డీఏ, హౌసింగ్, మునిసిపల్ ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయాలకు డిప్యుటేషన్లపై వెళ్లిపోతున్నారు.

ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో పరీక్షలు పెట్టి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎమినిటీస్ సెక్రెటరీలుగా పోస్టింగ్‌లు చేశారు. ప్రభుత్వ ఉద్యోగం కావడంతో చాలామంది పట్టభద్రులు అప్పటికే వివిధ కంపెనీల్లో నెలకు రూ. 60 వేల నుంచి రూ. 80 వేల వరకు ఉన్న జీతాలను కూడా వదులుకొని వచ్చి రూ. 15 వేల జీతంపై విధుల్లో చేరారు. జీతం పేస్కేల్ నిర్ణయించడానికి ఎక్కువ సమయం అప్పటి ప్రభుత్వం తీసుకోవడంతో తమ భవిష్యత్తు ఎక్కడ అంధకారం అవుతుందోనని చాలామంది ప్రత్యామ్నాయం చూసుకొన్నారు. గుంటూరు నగరంలోనే పది నుంచి 20 మంది మధ్యన ఎమినిటీస్ సెక్రెటరీలు ఎలాంటి అనుమతి తీసుకోకుండానే విదేశాలకు వెళ్లిపోయి అక్కడ చదువు పూర్తి చేసి ఉద్యోగాలు చేసుకొంటున్నారు. ఒక ఉద్యోగి అయితే రైల్వేలో మెకానికల్ విభాగంలో మంచి ఉద్యోగం తెచ్చుకొని వెళ్లిపోయాడు. మరో ఎమినిటీస్ సెక్రెటరీ టీసీఎస్‌లోకి వెళ్లారు. సత్తెనపల్లిలో అయితే అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఒక ఉద్యోగిని తీవ్రంగా అవమానించడంతో అతను ఉద్యోగం వదిలేసి ప్రతిష్ఠాత్మకమైన సంస్థలో ఎంబీఏ పూర్తి చేసి నేడు మంచి పొజిషన్‌కు చేరుకొన్నారు. ఉన్న కొద్దిమందికి నాలుగైదు సచివాలయాలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. కొంతమందిని ఏపీసీఆర్‌డీఏ డిప్యుటేషన్‌పై తీసుకొన్నది. హౌసింగ్, ఈఎన్‌సీ కార్యాలయాలు కూడా కొందరిని తీసేసుకోవడంతో జిల్లా వ్యాప్తంగా ఎమినిటీస్ సెక్రెటరీల సంఖ్య తగ్గిపోయింది. ఇలా ఎలాంటి అనుమతి తీసుకోకుండా వెళ్లిన వాళ్లలో కొందరు వెనక్కు రాగా సంబంధిత అధికారులు ఫైళ్లు నడిపి జాయినింగ్ ఆర్డర్స్ ఇచ్చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఒక సచివాలయంలో ఎమిని టీస్ సెక్రెటరీ/ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రెటరీలలో ఒకరు మాత్రమే ఉండాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో అయితే ఇంజనీరింగ్/ఎనర్జీ అసిస్టెంట్‌లలో ఒకరే ఉండాలని పేర్కొన్నది.

# హార్వెస్టర్ కోత.. పశు పోషణకు వాత

- పెరిగిన ఎండుగడ్డి ధరలు
- తగ్గుతున్న సంప్రదాయ కోతలు
- నానాటికి తగ్గుముఖం పడుతున్న పాడిరైతులు

తెనాలి రూరల్,మే19 (ఆంధ్రజ్యోతి): ఎండుగడ్డి ధరలు నానాటికి పెరిగిపోతుండటంతో పశుపోషకులు తలకు మించిన భారంగా మారి ఆందోళన చెందుతున్నారు. కృష్ణా డెల్టాలో దాదాపుగా ఖరీఫ్‌లో 5 లక్షల ఎకరాలకు పైగా వరి సాగయింది. పంటలు కూడా బాగా పండాయి. పంటలు చేతికి వచ్చే సమయానికి వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో ఎక్కువ సంఖ్యలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేలా హార్వెస్టర్లతో కోతలు కోయిస్తున్నారు. వీటి ద్వారా అయితే ఎప్పటి ధాన్యం అప్పుడు వెలుపలకు తరలించుకునే అవకాశం ఉంటుంది. పైగా కూలీల ఖర్చుకూడా తగ్గుతుందన్న ఉద్దేశంతో సంప్రదాయ కోతలు, కుప్పలూ, నూర్పిడిల వైపు మొగ్గు చూపడంలేదు. హార్వెస్టర్‌తో వరిపైర్లను కోతలు కోయించే క్రమంలో ఎండుగడ్డి ముక్కలుగా అవడంతో పశుపోషణకు వినియోగించుకునే పరిస్థితి అతితక్కువగా ఉంటుంది. సంప్రదాయ నూర్పిడి వల్ల ఎండుగడ్డి ముక్కలవ్వకుండా లభించడంతో పాటు వాటిని కట్టలుగా కట్టి పశువులకు మేతగా వినియోగించుకోవచ్చు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా రైతాంగం 75శాతం వరకూ హార్వెస్టర్లతోనే కోతలు కోయించడానికి మక్కువ చూపుతున్నారు. మిగిలిన 25శాతం మంది మాత్రమే సంప్రదాయ కోతలను కోయిస్తూ కుప్పలు వేయించి ధాన్యం తీసుకుంటూ ఎండుగడ్డిని పశుపోషణకు తరలించుకుంటున్నారు. డెల్టా ప్రాంతం కావడంతో రెండో పంట రబీసాగుకు ముందే కోతల అనంతరం హార్వెస్టర్‌తో కోయించి ఎండుగడ్డి ముక్కలను రైతులు 90శాతం పొలాల్లోనే తగలబెట్టడంతో గడ్డి అగ్నికి ఆహుతై బూడిదగా మారుతుంది. మిగిలిన 10శాతం రైతులు మాత్రమే ఆ గడ్డిని కట్టలు కట్టి ట్రాక్టర్ మిషన్ ద్వారా ఉండలుగా చుట్టించుకుని తరలించుకునే పరిస్థితి. ఈ పరిణామాలతో ఎండుగడ్డి కొరత తీవ్రమవుతోంది. ఒక్క ఎండుగడ్డికే పాడిరైతు దాదాపుగా రూ.12000 నుంచి రూ. 15000 వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వీటికి తోడు దాణా, పచ్చిగడ్డి, తవుడు, బెల్లం వంటి వాటి ధరలు కూడా పెరగడంతో పశుపోషణ భారంగా మారి పాడిరైతులు పశుపెంపకాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఏ గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇంట చూసినా పాడిగేదెలు ఉండేవి. రాను రాను అవి క్రమేపీ తగ్గుతూ 10 ఇళ్లకు ఒక గేదె వంతున పెంపకం దారులుగా ఉంటున్నారు. ఇదే కొనసాగితే పశుపెంపకం దారులు తగ్గి పాల కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగితే తప్ప దీనికి పరిష్కారం లభించదని పలువురు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పంటపొలాల్లో అక్కడక్కడా ఉన్న పచ్చిమేత మేస్తున్న పశువులు



ట్రాక్టర్‌తో తెనాలి ప్రాంతానికి తీసుకువస్తున్న ఎండుగడ్డి

# ప్రారంభమైన కళా పరిషత్ నాటిక పోటీలు

వినుకొండ, మే 19 ( ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నాటిక పోటీలను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ముందుగా నటరాజు, ఎన్టీఆర్‌లకు పూజలు నిర్వహించారు. శివశక్తి లీలా ఫౌండేషన్ చైర్మన్ లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన భార్య మక్కెన పద్మావతి, ప్రభుత్వ న్యాయవాది ముప్పాళ్ల కల్పన పాల్గొని జ్యోతి వెలిగించి నాటికల పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటిక, ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి కిడ్నాప్ నాటికలను శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీలను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యేలు సతీసమేతంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో నిర్వహాకులు ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకట కోటయ్య, జ్ఞానేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కౌన్సిలర్ షకీలా బేగం, జనసేన పార్టీ నాగశ్రీను రాయల్, తదితరులు పాల్గొన్నారు.




జనరల్ బోగీలు నాటికలోని సన్నివేశం



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన



దుర్గిలో జరిగిన శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి , ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

## విద్యాలయాల అభివృద్ధిపై

# ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి
- కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దుర్గి, కారంపూడి మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బంగారు భవిష్యత్‌కు పునాదులే విద్యాలయాలు అని విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దుర్గిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, ఆదర్శ పాఠశాల, కారంపూడిలోని కేజీబీవీలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. దుర్గి కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రూ.1,51,50,000 ఆదర్శ పాఠశాలలో బాలికల వసతిగృహ నిర్మాణం కోసం రూ.1,72,86,000 మంజూరైనట్లు తెలిపారు. కారంపూడి కేజీబీవీలో రూ. 1.50 కోట్లతో వసతి గృహం, అదనపు గదులు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ వసతి గృహం లేక విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి.. మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని మంత్రి పేర్కొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పల్నాడు జిల్లా అభివృద్ధిలో దూసుకెళ్తోందని, తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చేసేందుకు వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను వైన్స్‌ల వద్ద కాపలా ఉంచారని, దోచుకో.. దాచుకో అన్న చందాన వ్యవహరించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కూడా గడవకముందే రోడ్ల నిర్మాణంతో పాటు పాఠశాలల అభివృద్ధికి మాచర్ల నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో నిధులు రావడం అదృష్టమన్నారు. అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కారంపూడి మండలంలోని మిర్యాల గ్రామం ఎస్సీ కాలనీ వాసులు ఆ గ్రామ నేత దారెడ్డి ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, కారంపూడి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, ఎంపీపీ యేచూరి సునీతా శంకర్, దారునాయక్, యాగంటి మల్లికార్జునరావు, ఇతర నాయకులు, మండలాధికారులు పాల్గొన్నారు.



కారంపూడిలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

# అవగాహనతో.. చౌడు భూముల్లో సిరులు



బాపట్లలోని అఖిలభారత సమన్వయ ఉప్పునీటి పరిశోధన కేంద్రం

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సమీపిస్తోంది. సాగుకు రైతు భూమి సిద్ధం చేయడానికి సమాయత్తమవుతున్నారు. భూమి యాజమాన్య పద్ధతుల్లో రైతులు అనాదిగా ఒకే విధమైన పద్ధతులు పాటిస్తున్నారు. దీంతో సరయిన దిగుబడులు సాధించలేకపోతున్నారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో సముద్ర జలాలు భూగర్భంలో చొచ్చుకు వస్తున్నాయి. దీంతో పలు చోట్ల భూములు చౌడుబారుతున్నాయి. రైతులకు ఆ భూముల యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉండడం లేదు. ఈ నేపథ్యంలో వాటి యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

**ఉప్పునేలలు (తెల్ల,పాలచౌడు) :** భూ ఉపరితలంపై తెల్లపొరలాగా ఏర్పడటం తగినంత తేమ ఉన్నప్పటికి మొక్కలు వడలిపోవటం జరుగుతుంది. వర్షపాతం తక్కువగా ఉండి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలోని భూముల్లో నీరు ఆవిరయి వాతావరణంలో కలుస్తుంది. ఈ సమయంలో భూమిలో ఉన్న లవణాలు నీటి ద్వారా భూమి పై పొరలోకి వస్తాయి. నీటిమట్టం భూమి ఉపరితలానికి అతిదగ్గరగా ఉన్న నేలల్లో సహజంగా లవణ శాతం అధికంగా ఉంటుంది. మురుగునీరు పోయే వసతి లేని ప్రాంతాలలోను, కావాల్సిన పరిమాణం కన్న ఎక్కువనీరు ఉపయోగించినప్పుడు, లవణాలతో కూడిన నీరు సాగుకు వాడినప్పుడు పాలచౌడుగా మారుతాయి.



సముద్రతీర ప్రాంత గ్రామాలలోని పాలచౌడు భూములు

### లక్షణాలు

నేలపై పొరలలో బుడిద రంగుగల ఉప్పు పొక్కు గట్టి తెల్లగా పేరుకుంటాయి. ఈ లక్షణాలు వేసవి చివరిలో బాగా కనిపిస్తాయి. ఈ భూములు వర్షాలు పడగానే దున్ని విత్తనాలు చల్లితే మొలకెత్తావు. మొలకెత్తిన పైరు పెరుగుదల, సాంద్రత తక్కువగా ఉంటుంది. నీరు ఇంకే శక్తి మాములు కంటే ఎక్కువగా ఉంటుంది. నీరు పొలంలో ఉన్నప్పటికి పైరుకు అందక మొక్కఆకులు ముడుచుకుపోయినట్లు కనపడుతాయి. సమస్య ఎక్కువ అయినప్పుడు మొక్కలు చనిపోతాయి. ఈ భూములలో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉంటుంది.

### యాజమాన్యపద్ధతులు

ఉప్పునేలలను బాగు చేయటానికి నేలలో ఉన్న నీటిలో కరిగే లవణాలను తొలిగించాలి. ఈనేలలను బాగు చేయటానికి మంచి నీరు అవసరం. నేలపై పేరుకుపోయిన ఉప్పు లేక తెల్లచౌడును పారలతో తొలిగించాలి. వాలును బట్టి పొలాన్ని చిన్నచిన్న మడులుగా చేసుకోవాలి. ప్రతిమడికి నీరు పెట్టి కాల్వల ద్వారా బయటకు పంపించాలి. ప్రతిమడిలో 15-20 అంగుళాల వరకు నీరు పెట్టి బాగా దమ్ము చేయాలి ఈవిధంగా చేయటం వలన నీటిలో లవణాలు కరుగుతాయి. నాలుగురోజుల తర్వాత ఇంకిపోగా మిగిలిన నీటిని మురుగుకాల్వ ద్వారా బయటకు పంపాలి. ఈవిధంగా లవణాలు తొలిగిపోయే వరకు మళ్ళి మళ్ళి చేయాలి. అదేవిధంగా పచ్చిరొట్ట, పశువుల ఎరువు, సూపర్ ఫాస్ఫేట్‌ను ఎక్కువగా వాడాలి. క్లోరైడ్, సల్ఫేట్ కలిగిన ఎరువులను వాడరాదు. అధికమోతాదులో నత్రజని ఎరువును వాడాలి. సేంద్రియ ఎరువు, జీవన ఎరువులు, రసాయనిక ఎరువులు కలిపి వాడితే మంచి ఫలితాలు పొందవచ్చు. ఈభూములలో ఎక్కువ సాంద్రతలో మొక్కలు ఉండేవిధంగా చూడాలి. ఈ భూములకు ఎక్కువగా ఆమ్ల గుణం, అమోనియం సల్ఫేట్, యూరియా ఎరువులను వాడుటం మేలు. వీటిని చివరి దమ్ములో వేయాలి.

**నల్లచౌడుభూములు (క్షార) :** మురుగునీరు నిల్వ ఉండటం, నేల గట్టిపడటం, తక్కువనీరు ఇంకేగుణం, నీరు, మట్టికోత, మట్టి రేణువులు విడిపోవటం వల్ల నల్లనిరంగు సంతరించుకుంటుంది. మొక్కల పెరుగుదల క్షీణించి ఆకుల అంచుల వెంబడి ఎండి మాడిపోతాయి.

### లక్షణాలు

నల్లచౌడుభూములు వర్షా కాలం వచ్చేసరికి భూమిపై నల్లకప్పు ఏర్పడుతుంది. ఉదజని సూచిక 8.3 కన్న ఎక్కువ. లవణశాతం 4.0 కన్న తక్కువగా మార్పిడి చెంది సోడియం 15శాతం కన్న ఎక్కువగా ఉంటుంది. నేలలో కణములు విడివిడిగా ఉండటం వలన నేలలో రంధ్రాలు పూడిపోతాయి. నేలలోనికి గాలిని, నీటిని ప్రవేశించనీయవు. మొక్కల జీవనప్రక్రియ సరిగ్గా జరగదు. ఎక్కువ కాలం తేమ ఉంటుంది. ఎండిన తర్వాత నేల చాలా గట్టి పడుతుంది. ఈభూములలో సోడియం కార్బోనేట్స్, బైకార్బోనేట్స్ ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఈ భూములలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది.

### యాజమాన్యపద్ధతులు

ఈనేలలను బాగుచేయటం అంటే సోడియం తొలిగించటం, ఉదజని సూచిక తగ్గించటం ఈభూములను బాగుచేయటానికి జిప్సం, పైరైట్స్ అను పదార్థాలను ఉపయోగించవలెను. వీటిల్లో జిప్సం విరివిగా వాడుతారు. ఇందులో మొక్కకు కావాల్సిన కాల్షియం, గంధకం రెండు పోషకపదార్థాలు ఉన్నాయి. కాల్షియం లోపల ఉన్న భూముల్లో జిప్సంను, కాల్షియం కార్బోనేట్స్ ఎక్కువగా ఉన్న భూములలో పైరైట్స్ లేదా పశువుల ఎరువు వాడాలి. భూమిని చిన్నచిన్న మడులుగా ఏర్పాటు చేసి 0.1శాతం వాలు ఉండేటట్లు చూడాలి. నీరు పెట్టుటకు, తీయటకు వేర్వేరు కాల్వలు తయారు చేయాలి. మంచినీటి వసతి సమృద్ధిగా ఉండాలి. ఈభూములలో జీలుగను పెంచి పూతకు వచ్చినప్పుడు కలియదున్నాలి. రెండు,మూడు సంవత్సరాలు వరుసగా ఈ ప్రక్రియ చేపడితే నల్లచౌడు పూర్తిగా విరిగి పైర్లు బాగా ఎదిగి దిగుబడులు వస్తాయి. ఈ భూములలో నత్రజని, జింకు పోషక పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. కావున పొలాలు బాగు చేసిన తర్వాత వీటిని తప్పకుండా వాడాలి. అమోనియా సల్ఫేట్, కాల్షియం, అమోనియా నైట్రేట్ ఎరువులు యూరియా కన్నా బాగా ఉపయోగపడతాయి. ఈభూములలో 1,2 సంవత్సరాలు పొటాష్ అవసరం ఉండదు. ఈభూములకు పశువుల ఎరువు, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడకం చాలా ఉపయోగంగా ఉంటుంది.

### యాజమాన్యపద్ధతులు చేపట్టాలి

**అఖిలభారత సమన్వయ ఉప్పునీటి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.మధువాణి**



తీరప్రాంత గ్రామాలలో భూగర్భ నీరు ఉప్పుగా ఉంటుంది కాబట్టి ఈ నేలలు ఏర్పడుతాయి. వీటిని పునరుద్ధరించటానికి తగిన సూచనలు, సలహాలు పాటించాలి. విచ్చలవిడిగా ఎరువులు వాడరాదు. వర్షాలు తక్కువగా, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఈభూములు కనిపిస్తాయి. మంచినీటితో పొలాలను శుద్ధి చేసుకోవాలి. పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువులు ఎంతోమేలు చేస్తాయి.

## శ్రీరాజరాజేశ్వరీదేవిగా శ్రీమహంకాళీ అమ్మవారు

● ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించిన మహిళలు


శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన శ్రీమహంకాళీ అమ్మవారు

దుగ్గిరాల, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటిగా వెలుగొందుతున్న కేఆర్ కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం 48వ పునఃప్రతిష్ఠ రెండోరోజు ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలో పలువురు యార్లగడ్డ రోహిణీ కుమార్, సంధ్యారాణి దంపతులతో శ్రీచండీహోమం జరిపించారు. కృష్ణచైతన్య నేతృత్వంలో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, తారక్‌నాథ్‌శర్మ, మణిశర్మలు దంపతులతో పూజలు జరిపించారు. 200 మందికి పైగా మహిళలు గ్రామం నుంచి ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం హోమంలో పాల్గొన్న దంపతులతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈవో కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారు మంగళవారం శ్రీధనలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమీయనున్నారు.

## విద్యా రంగ సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ వినతి


ఇంటర్మీడియేట్ విద్య కమిషనర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేసిన ఏఐఎస్‌ఎఫ్ నేతలు

మంగళగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా సంవత్సరం ఆరంభమవుతున్న నేపథ్యంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలో ఇంటర్మీడియేట్ విద్య కమిషనర్ కృతికా శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలరాజు, బందెల నాసర్‌జీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక కార్పొరేట్ కళాశాలల్లో అకాడమీల పేరుతో ఇంటర్ బోర్డు గుర్తింపులేని జూనియర్ కళాశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురిచేస్తున్నాయని ఆరోపించారు. ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ శాతం మంది పేదవారే ఉన్నారని, వారికి ప్రభుత్వమే ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠ్యపుస్తకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఫణీంద్ర, నాగభూషణం, జిల్లా కార్యదర్శి యశ్వంత్ పాల్గొన్నారు.

## ఏక దైవారాధనలో ప్రవక్త ఇబ్రహీం ఆదర్శం


ఇస్లాం ధార్మిక సభలో ప్రసంగిస్తున్న అబ్దుల్ మాబూద్ జామిఈ

మంగళగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏక దైవారాధనలో ప్రవక్త ఇబ్రహీం మానవాళికి ఆదర్శమని జనాబ్ అబ్దుల్ మాబూద్ జామిఈ అన్నారు. ఎర్రబాలెం గ్రామంలోని బసవతారక నగర్‌లో గల మసీద్-ఏ-మొహమ్మద్‌లో జరిగిన ఇస్లాం ధార్మిక సభలో ఆయన ప్రసంగించారు. ప్రవక్త ఇబ్రహీం ఏక దైవారాధనతో తన జీవితాన్నే దైవసేవకు అంకితం చేశారని చెప్పారు. మనిషి జీవితం ఎంతో సున్నితమైనదని, ఎవరు ఎప్పుడు ఎక్కడ మరణిస్తారో కూడా తెలియదన్నారు. ప్రవక్త యాకూబ్ తాను చనిపోయే సమయంలో తన సంతానానికి సైతం సృష్టికర్త ఒక్కడినే ఆరాధించాలని హితబోధ చేశారని గుర్తుచేశారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రజలు సృష్టికర్తను మర్చిపోయి ధర్మాన్ని విడిచి విచ్చలవిడిగా జీవితాన్ని గడుపుతూ దైవ ప్రవక్తల సందేశాలను విస్మరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మొయిద్ ఉమ్రీ, జాబిర్ దాయీ, అబ్దుల్ జబ్బార్, మసీద్ ఇమామ్ అబ్దుల్ కరీమ్ సలఫీ తదితరులు పాల్గొన్నారు.

## కడప మహానాడును జయప్రదం చేయాలి

● దానబోయిన సుందరరావు యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న దానబోయిన సుందరరావు యాదవ్

మంగళగిరి సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరుగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు మంగళగిరి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ పిలుపునిచ్చారు. మంగళగిరిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళగిరిలో ఆదివారం నిర్వహించిన మినీ మహానాడును విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేశారు. మంత్రి నారా లోకేశ్ గతంలో ఓడినప్పటికీ నియోజకవర్గ ప్రజలను అక్కున చేర్చుకుని తన సొంత ఖర్చులతో 26 రకాల సంక్షేమ పథకాలను అమలు చేశారని చెప్పారు. మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి లోకేశ్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే మంగళగిరి నుంచి మహానాడుకు ఎక్కువ మంది నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు చావలి ఉల్లయ్య, పల్లపాటి శ్రీనివాస్, ఉయ్యాల శంకరరావు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ఆలయంలో కుంకుమ పూజ


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

పెదనందిపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ తల్లి తిరుణాల మహోత్సవాల్లో భాగంగా సోమవారం దేవస్థానంలో కుంకుమ పూజ నిర్వహించారు. అర్చకులు మహిళలతో అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తీర్థ ప్రసాదాల అందజేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి తలంట్లు, పొంగళ్లు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

## విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

● ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు

పెదనందిపాడు, మే 19(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవిలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయం అని దీనివల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లను ఆక్రమిస్తున్న పోలీసులు

● వివిధ కేసుల్లో వాహనాలు స్వాధీనం.. రోడ్లపైనే పార్కింగ్

● ఒక రోడ్డు పూర్తిగా మూసుకుపోయిన వైనం

● మరో రోడ్డులోనికి వాహనాలు వచ్చే అవకాశం తక్కువే


పోలీస్‌స్టేషన్ ముందు రోడ్డుకు రెండు వైపులా పార్కు చేసిన వాహనాలు


పోలీస్‌స్టేషన్‌కు రెండో వైపున తుప్పుబట్టి పాడైపోతున్న వివిధ కేసుల్లోని వాహనాలు

ప్రత్తిపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలంలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్ ఇప్పుడు ప్రజలకు ఇబ్బందిగా మారింది. ప్రత్తిపాడుకు నడిబొడ్డులో నివాసాలకు ఆనుకుని ఇరుకు రోడ్ల మధ్య ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్ వాహనదారులకు కష్టాలు తెచ్చిపెట్టింది. పూర్వం సైకిళ్లు మాత్రమే ఉండేవి కాబట్టి సరిపోయేది. కానీ మారుతున్న కాలానుగుణంగా కార్ల వినియోగం పెరిగిపోవడంతో రోడ్లు ఇరుకుగా అయ్యాయి. అంతేగాక ప్రత్తిపాడు సర్కిల్ కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు. ఇరుకు రోడ్లలో రెండు వైపుల మార్జిన్‌లలో కార్లు పార్కు చేస్తే వాహనాలు తిరగడానికి వీల్లేకుండా ఉంది. ప్రజలు తిరగడానికి ఇబ్బందిగా ఉంటుంది.

**పార్కింగ్‌కు స్థలం లేకపోవడమే..**

ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు ప్రధాన సమస్య పార్కింగ్‌కు స్థలం లేకపోవడమే. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను తీసుకు వచ్చి పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న సిమెంటు రోడ్డులో పడేస్తున్నారు. అవి సంవత్సరాల తరబడి అలాగే ఉండి తుప్పు బట్టి పోతున్నాయి. కొన్ని వాహనాలైతే ఎదురుగా ఉన్న పాఠశాలలో పడేశారు. ఈ వాహనాలను రోడ్డు పైనే పడేయడంతో పెద్ద వాహనాలు ఈ రహదారిలో తిరిగే అవకాశం లేకుండా పోతుంది. అంతే కాకుండా మరో పక్క సీఐ, ఎస్ఐల వాహనాలతో పాటు పలు కార్లు నిత్యం పార్కు చేస్తున్నారు. చివరికి పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి వాహనాలు ఇక్కడకు రావాలన్నా రాలేని పరిస్థితి ఏర్పడుతుంది. రోడ్డును పోలీసులు పూర్తిగా ఆక్రమించు కోవడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా సమస్య తీవ్రమవుతుందే తప్ప పరిష్కారం గురించి మాత్రం ఆలోచన లేదు.

**మాటలకే పరిమితమైన తీరు**

పోలీస్ స్టేషన్‌ను మార్చాలనే ప్రతిపాదన ఇప్పటికీ మాటలకే పరిమితమైంది. ప్రధాన రహదారిలో పోలీస్‌స్టేషన్ ఉంటే బాగుటుందని, దీనివల్ల ప్రయోజనాలున్నాయని గతం నుంచి ఉన్నతాధికారులు భావిస్తున్నారు. గ్రామంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను మార్పు చేస్తేనే మంచిదనే భావన అందరిలో ఉంది. అందుకు సంబంధించి ఇంతవరకు ఎవరూ కూడా ఒక్క అడుగు ముందుకు వేసిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో హోంమంత్రిగా ఉన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత స్థలాన్ని చూసి అధునాతన పోలీస్ స్టేషన్‌ను సొంత నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తుందని అందరూ భావించారు. కాని ఆ దిశగా ఆమె ఆలోచన కూడా చేయకపోవడంతో నేటికీ ఎక్కడి పరిస్థితులు అక్కడే దర్శనమిస్తున్నాయి.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు మంత్రి లోకేశ్ కృషి

● ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

● కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అనురాధ

మంగళగిరి సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తెలిపారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో మహిళల కోసం ఏర్పాటు చేసిన మూడు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను సోమవారం ఆమె స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. మంగళగిరి పట్టణంలోని రాజీవ్ గృహకల్ప వద్ద గల కమ్యూనిటీ హాలు, ఇందిరానగర్ కృష్ణ బలిజ కమ్యూనిటీ హాలు, కాజ గ్రామంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మూడు నెలలపాటు శిక్షణ పొందిన తర్వాత ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడమే కాకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి ఆర్థికంగా స్థిరపడవచ్చని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ తన సొంత నిధులతో స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని 3,508 మంది మహిళలకు ఉచిత శిక్షణ, కుట్టు మిషన్లు అందజేశారన్నారు. స్త్రీ శక్తిని స్ఫూర్తిగా తీసుకుని నేడు రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణ, కుట్టుమిషన్లు అందిస్తున్నట్టు చెప్పారు. మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, బీసీ కార్పొరేషన్ ఏడీ మయూరి, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శకుంతల, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మీ, రాష్ట్ర కార్యదర్శి వింజమూరి ఆషాబాల, నేతలు గాదె పిచ్చిరెడ్డి, మంచికలపూడి వైష్ణవి, బీజేపీ నేత తుల్లిమిల్లి రామకృష్ణ, వూట్ల దుర్గామల్లేశ్వరీ, గోసాల రాఘవ, వాసా పద్మ, పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన నేత అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, సింహాద్రి బేబీరాణి, గంజి శివసుధ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్యకి నివాళి


ఉండవల్లిలో పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎం రవి తదితరులు

తాడేపల్లి (ఉండవల్లి), మే 19(ఆంధ్రజ్యోతి): అమరజీవి పుచ్చ లపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఉండవల్లిలో సీపీ ఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ప్రియతమ నేత అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటితరానికి మార్గదర్శకమని అన్నారు. 20 సంవత్సరాల పాటు పార్లమెంటు, శాసనసభ్యుడిగా పనిచేసిన సుందరయ్య నిరాడంబరంగానే పార్లమెంటుకు అసెంబ్లీకు వెళ్లి ప్రజావాణి వినిపించారన్నారు. సీపీఎం కార్యాలయంలో, అమరారెడ్డి నగర్‌లో సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి అరుణ పతాకాల ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్లో సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సీనియర్ నేతలు జొన్నా శివశంకర్, బూరుగ వెంకటేశ్వర్లు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని శివశంకర్ ప్రారంభించారు.

● దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి): దున్నేవాడిదే భూమి అని చెప్పి పేదలకు కూడు, గూడు కోసం జీవితకాలం పాటుపడిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి, కార్యవర్గసభ్యుడు ఈమని అప్పారావు అన్నారు. మంచికలపూడిలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● పెదనందిపాడు, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం నాయకుడు దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు.

## ఏకగ్రీవంగా దుగ్గిరాల మండల పరిషత్ ఉపాధ్యక్షుడి ఎన్నిక

● ఉపాధ్యక్షుడిగా మరీదు రాము


మరీదు రామును అభినందిస్తున్న ఎంపీపీ జబీన్, ఎంపీటీసీ సభ్యులు

దుగ్గిరాల, మే 19 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలపరిషత్ ఉపాధ్యక్షుడిగా మంచికలపూడి ఎంపీటీసీ సభ్యుడు మరీదు రాము ఎన్నికయ్యారు. డ్వామా పీడీ శంకర్ ఎన్నిక అధికారిగా నిర్వహించిన ఎన్నికలో ఎంపీపీ జబీన్‌తోపాటు, మొత్తం 9మంది సభ్యులు, కో-ఆప్షన్ సభ్యుడు వహిదుల్లా పాల్గొనగా, వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. తుమ్మపూడి ఎంపీటీసీ సభ్యురాలు వాసిరెడ్డి లక్ష్మీదేవి రామును ఉపాధ్యక్ష పదవికి ప్రతిపాదించగా, ఈమనికి చెందిన జనసేన ఎంపీటీసీ సభ్యురాలు పసుపులేటి సాయిచైతన్య బలపరిచారు. రాము మినహా ఉపాధ్యక్ష పదవికి ఎవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో, ఎన్నికకు హాజరైన టీడీపీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీటీసీ సభ్యులు రామును అభినందించి, ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, పలువురు మండలపరిషత్ అధికారులు, మండల జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, యేమినేని కోటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అద్దెకు ఆర్టీసీ స్థలాలు

● 22న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం

గుంటూరు, మే 19(ఆంధ్రజ్యోతి): విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌ల పరిధిలో నిరుపయోగంగా ఉన్న స్థలాలను అద్దెకు ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని పెదకాకాని, తెనాలి, పెదనందిపాడు బస్టాండ్ ఆవరణల్లో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను వ్యాపారం నిమిత్తం అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం రవికాంత్ సోమవారం తెలిపారు. ఆర్టీసీ కేవలం టిక్కెట్ల రూపంలోనే ఆదాయం కాకుండా దుకాణాల అద్దెలతో పాటు ఖాళీగా నిరుపయోగంగా ఉన్న స్థలాలను కూడా అద్దె రూపంలో ఇచ్చి అదనపు ఆదాయం సమకూర్చుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే గుంటూరు బస్టాండ్ ఆవరణలో ఇది అమలుజరుగుతోందన్నారు. కాగా ఈనెల 22న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని సమావేశ మందిరం లో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## చలో విజయవాడను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికై జూన్ 5న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఉద్యోగ సమస్యలే ప్రధాన అజెండాగా నిర్వహిస్తున్న సభకు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరవ్వాలని కోరారు. సమావేశానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోతురాజు, కరీముల్లా, విజయబాబు, అరుణకుమారి, రోజా తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ గోడౌన్‌తో ఇబ్బందులు పడుతున్నాం

గుంటూరు(తూర్పు), మే 19 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య ఏర్పాటు చేసిన సిమెంట్ గోడౌన్‌తో ఇబ్బందులు పడుతున్నామని పెదనందిపాడుకు చెందిన మాజీ సైనికుడు కాపు సాంబశివరావు సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీ అందజేశారు. ప్రత్తిపాడుకు చెందిన కాశీం అనే వ్యక్తి ఈ గోడౌన్‌ను అద్దెకి తీసుకుని సిమెంట్ వ్యాపారం చేస్తున్నాడని చెప్పారు. బస్తాల దిగుమతి, ఎగుమతి సమయంలో విపరీతమైన దుమ్ము రేగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కొంత మంది అనారోగ్యం బారిన పడుతున్నామని చెప్పారు. దీనిపై స్థానిక ఎమ్మార్వోను కలిస్తే ఇళ్లను ఖాళీ చేసుకోండి.. అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని తెలిపారు.

● రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు..

ఉద్దేశపూర్వకంగా కొంత మంది రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని మేడికొండూరు మండలం, మేడికొండూరు గ్రామానికి చెందిన గ్రామస్థులు అర్జీ అందజేశారు. మేడికొండూరు నుంచి తాళ్లూరు మీదగా నరసరావుపేటకు వెళ్లే రహదారి నిర్మాణానికి పొలాలు ఇచ్చామని, ఇద్దరు మాత్రం పొలం ఇవ్వకుండా, పైగా టెండర్‌లో లేకపోయిన ప్రహరీ నిర్మించారని తెలిపారు. అంతేగాక రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసులు పెడుతున్నారని వివరించారు. ఈ రోడ్డు కోసం ఏళ్ల నుంచి వేచిచూస్తున్నామని ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి ఏర్పడిన అటంకాలను తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బొట్ల రామకృష్ణ, ప్రతాప్, ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

● సర్వే రిపోర్టు ఇప్పించండి

నా పొలానికి సంబంధించిన సర్వే రిపోర్టు ఇప్పించాలని ప్రత్తిపాడుకు చెందిన షేక్ రహంతుల్లా అర్జీ అందజేశారు. పెదనందిపాడు గ్రామ పరిధిలో సర్వే 428/ఏలో 68 శెంట్లు భూమి ఉందని, 2016లో ఈ భూమిని వేరే పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేసారని చెప్పారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది ఈ పని చేశారని అరోపించారు. ఆన్‌లైన్ సర్వే రిపోర్టు ఇప్పించాలని స్థానిక అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

## మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

గుంటూరు(తూర్పు), మే 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలంటూ జీజీహెచ్ శవాగారం ఎదుట ఆయన బంధువులు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆదివారం మేడికొండూరు మండలం, డొకిపర్రు గ్రామానికి చెందిన తంబూరు బ్రహ్మేశ్వరరావు అనే వ్యక్తి వేములూరిపాడు వద్ద ఓ ప్రైవేటు సంస్థ క్రషర్‌కు చెందిన లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడని తెలిపారు. ప్రమాదంపై క్రషర్ యజమాని స్పందించకపోవడం దారుణమన్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, యజమాని స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. శవాగారం ఎదుట ధర్నాకు దిగడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు రంగంలోకి దిగి వారితో మాట్లాడంతో ఆందోళనను విరమించారు.

### దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

దుగ్గిరాల, మే 19 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని చెన్నకేశవ నగర్‌కు ఉప్పలకుంట వాసి, కఠవరపు చిట్టిబాబుపై ప్రసన్న మరో ఇద్దరు దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. గాయపడిన చిట్టిబాబు తెనాలి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, వైద్యశాల నుంచి అందిన సమాచారం మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరవి చెప్పారు.

### ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ


తాడికొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ చేస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో పీ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'కలగానే స్వచ్ఛభారత్ ఆశయం' కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గతంలో ఇంటింటికి తిరిగి రిక్షాల ద్వారా చెత్తను సేకరించింది వాస్తవమేనని తెలిపారు. కానీ నూతనంగా ట్రాక్టర్లు కొనుగోలు చేయడం వల్ల ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నామని తెలిపారు. ట్రాక్టర్లు లేని పంచాయతీలకు రిక్షాలను తరలించి చెత్తను సేకరిస్తామని అన్నారు. ఇంటింటికి చెత్త సేకరించే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు.

## వరగాని అధ్యక్షుడిగా చెన్నుపాటి


చెన్నుపాటి సురేంద్ర

పెదనందిపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వరగాని తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడిగా చెన్నుపాటి సురేంద్రను ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. గ్రామంలోని పార్టీ నాయకులతో కలసి గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి పరిష్కరించారని దీంతో మరలా సురేంద్రనే కొనసాగించాలని గ్రామ పార్టీ సీనియర్ నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అధ్యక్షుడితో పాటుగా కమిటీని ఎన్నుకున్నారు. సురేంద్రకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సినియర్ నాయకులు వెంకటప్పయ్య, శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీపీఐ నేత నన్నపనేని మృతి


వెంకటేశ్వరరావు (ఫైల్ ఫొటో)

మంగళగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత నన్నపనేని వెంకటేశ్వరరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి కన్నుమూశారు. ఆయన మృతికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ సంతాపం తెలియజేశారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, నేతలు భావన శ్రీనివాసరావు, జవ్వాది సాంబశివరావు, బసవపున్నయ్య, రత్నాంజలి, శివయ్య, శివకుమారి, రాజారావు, తదితరులు వెంకటేశ్వరరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

## 22న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు

తెనాలి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఈ నెల 22న ప్రారంభమవుతాయని ఈవో ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉత్సవాల కరపత్రాలను అర్చకులు కిరణ్‌కుమార్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలలో విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తారు. 21న ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తులందరికీ జెండాలు అందజేస్తామన్నారు. అంజనేయస్వామి సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ప్రతిరోజు హనుమాన్ చాలీసా నిర్వహిస్తారని చెప్పారు.



## ఆంజనేయ స్వామికి జంభీర ఫలార్చన

తెనాలి అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): మారీసుపేట శివాలయంలో వీరాంజనేయ స్వామివారికి సోమవారం జంభీర ఫలార్చన (నిమ్మ)చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న ఆంజనేయస్వామికి హనుమత్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. హనుమాన్ చాలీసా పారాయణ, తులసీ దళార్చన నిర్వహించి భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## నేటి నుంచి కొలకలూరులో హనుమత్ జయంతి ఉత్సవాలు

తెనాలిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులోని అభయ హస్త వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి హనుమత్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో తొలిరోజు సాయంత్రం శ్రీరామరక్ష స్తోత్రం, శ్రీలలితా సహస్రనామ పారాయణం, శ్రీవిష్ణుసహస్రనామ పారాయణాలు జరుగుతాయన్నారు. రెండో రోజున హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమం, భరతనాట్య నృత్య ప్రదర్శన ఉంటాయన్నారు. చివరిరోజున గణపతి పూజ, అభయ వీరాంజనేయస్వామివారికి పంచామృత విశేష పూజా ద్రవ్య అభిషేక పూజా కార్యక్రమాలు, నాగవల్లి (తమలపాకులు) దళార్చన, సాయంత్రం శ్రీసువర్చలా సమేత శ్రీఅభయవీరాంజనేయ స్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుందన్నారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరుగుతుందని పరిసర ప్రాంతాల్లో స్వామివారి భక్తులందరూ పూజా కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## బస్ స్టేషన్‌లో అధిక ధరలకు అమ్మితే ఫిర్యాదు చేయండి: డీఎం

తెనాలి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : బస్‌స్టేషన్‌లోని దుకాణాలలో అధిక ధరలకు అమ్మితే ఫిర్యాదు చేయాలని డిపో మేనేజర్ రాజశేఖర్ కోరారు. తూనికలు, కొలతలు శాఖల ఆధ్వర్యంలో సోమవారం బస్‌స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏ దుకాణంలోనైనా నిర్ణీత ధరలకు మించి ఎక్కువగా తీసుకుంటే దుకాణదారులు శిక్షార్హులవుతారని చెప్పారు. కమోడీటీస్ లీగల్ మెట్రాలజీ శాఖ నిబంధనలు వివరించారు.

## కొలకలూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో గ్రామస్తులు అంధకారంలో మెలగాల్సిన పరిస్థితి నెలకొంది. గత రెండు రోజులుగా గ్రామంలో సాయంత్రం నుండి రాత్రి వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో గ్రామంలోని ప్రజలు, చిన్నారులు, వృద్ధులు ఉన్న ఇళ్లలో దోమల ఉధృతి, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఎందుకు నిలిచిపోతుందంటూ విద్యుత్ శాఖ అధికారుల తీరుతో మండిపడుతున్నారు. ఇకనైనా నితంతరం విద్యుత్ అందేలా చూడాలని కోరుతున్నారు.



కొల్లిపరలో వర్షానికి జలమయమైన రోడ్లు

## కొల్లిపరలో భారీ వర్షం

● జలమయమైన రోడ్లు ● తెనాలిలోనూ తేలికపాటి జల్లులు

కొల్లిపర, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం పడటంతో నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. మున్నంగి, వల్లభాపురం, తూములూరు, చివలూరు, సిరిపురం, దావులూరు, దావులూరిపాలెం, కొల్లిపర తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. రోడ్లపై అధికంగా వర్షం నీరు చేరడంతో పాదచారులు, వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

### తెనాలిలో...

తెనాలి, మారీసుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పగలు ఎండ అంతలోనే వర్షంతో తెనాలి పరిసర గ్రామాలలో చల్లటి వాతావరణం నెలకొంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో మండు వేసవిలో ఎండకాయాల్సిన సమయంలో వర్షాలు కురుస్తుండటంతో వేసవి తాపం నుంచి ఉపసమనం లంభించినట్టు అయింది. గత వారం వరకు ఎండ తాపానికి ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షాలు కురుస్తుండటతో ఈ ఏడాది ఎండలు తగ్గుముఖం పట్టినట్టేనని చర్చించుకుంటున్నారు.మరో వారం రోజుల్లో రోహిణి కార్తె రానుండగా వర్షాలు కురువడం, చల్లని వాతావరణం సంతరించడంతో గతంలో ఎన్నడూ చూడలేదని పలువురు చెబుతున్నారు. వేసవిలో మురుగు నీటి కాలువలను శుభ్రపర్చడంలో ఆ శాఖల అధికారులు నిమగ్నమై వర్షాకాలంలో వచ్చే వాన నీరు ఆ కాలువలలో ప్రవహించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. సోమవారం కురిసిన వర్షానికి పలు వార్డులు, ప్రధాన రోడ్లలో నీరు నిలిచి కాలువలోని మురుగు కాస్త వర్షంతో కలసి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీనితో దోమలు వృద్ధి చెంది అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్న ఆందోళన ప్రజలలో నెలకొంది. మునిసిల్ అధికారులు డ్రెయిన్లలోని వ్యర్థాలను తొలగించి, పారిశుధ్యంపై దృష్టిపెట్టి మురుగు నీరు పారుదల అయ్యేలా చర్యలు చేపట్టడంతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి పట్టణంలో పరిశుభ్ర వాతారణం నెలకొల్పాని పలువురు ప్రజలు కోరుతున్నారు.



తెనాలిలో తేలికపాటి వర్షానికే రోడ్లపై నిలిచిన నీరు

## పురపాలక సంఘానికి ఆరు అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న పక్కన డీఈ శ్రీనివాసరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలపై ఆరు అర్జీలు అందాయని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కు మూడు, హెల్త్ విభాగానికి రెండు అర్జీలు, టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒక అర్జీ అందిందన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరతగతిన పరిష్కరిస్తామని శేషన్న తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏసీపీ శివన్నారాయణ, ఏఈ నూరిబాబు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయంలో...

తెనాలి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 9 అర్జీలు అందినట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. వాటిల్లో 4సర్వేకు రాగా మరో నాలుగు రేషన్ కార్డులలో మార్పుల కోసం, మిగిలిన 1 విద్యుత్ శాఖకు సంబంధించినదిగా ఉన్నాయని పేర్కొన్నారు.

### సబ్ కలెక్టర్ కార్యాలయంలో...

తెనాలి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 దరఖాస్తులు అందజేశారు. రెవెన్యూ 6, మున్సిపల్, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు అందిందని అధికారులు తెలిపారు.



శానిటేషన్ పనులపై అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

## శానిటేషన్ పనులను పరిశీలించిన కమిషనర్

తెనాలి, మారీసుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత సత్యనారాయణ టాకీసు రోడ్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఆదేశాలతో పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. డ్రెయిన్లలోని సిల్ట్‌ను పూర్తిగా తొలగించి మురుగునీటి పారుదలకు అడ్డంకులు లేకుండా చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని వ్యర్థాలను చెత్తను కాలువలో వేయరాదని మూడు బుట్టల విధానం అనుసరించాలన్నారు. ప్రజలందరి సహకారంతో సుందర తెనాలి సాధ్యమౌతుందన్నారు. అనంతరం కొత్తపేటలోని పలు షాపుల ట్రేడ్ లైసెన్స్‌లను అకస్మిక తనిఖీచేశారు. ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించుకోవాలని, నూతన షాపులను ఏర్పాటు చేసినవారు నూతన ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకోవాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా షాపులను నిర్వహిస్తే మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామికి గరుడ వాహనసేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

తెనాలి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన ప్రాంతాల మీదుగా మేళ తాళాలతో స్వామి వారిని ఊరేగించి స్వామి వారికి గ్రామోత్సవం జరిపారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రాత్రి అలంకరించిన రథంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి పట్టణంలో దివ్య రథోత్సవం నిర్వహించారు. కోలాటం, వాయిద్యా బృందాలు, దేవతల వేషధారణలు పెద్ద సంఖ్యలో భక్తులు కోలాహలంగా రథోత్సవం సాగింది.



బాధితురాలికి ఆర్థికసాయాన్ని అందిస్తూ ధైర్యం చెబుతున్న తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ

## అగ్ని బాధితురాలికి సాయం

తెనాలిరూరల్,మే19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన కుటుంబానికి తహసీల్దార్ గోపాలకృష్ణ చేయూత నందించారు. పట్టణంలోని చెంచుపేట సమీపంలో కోనేరువారి వీధిలో నివసించే 47ఏళ్ల శాంతమ్మ ఫుట్‌పాత్‌పై నిమ్మకాయలు అమ్ముకుంటూ వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తోంది. ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తూ ఆమె నివసించే పూరింట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో ఇల్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బాధితురాలి వద్దకువెళ్లి తక్షణసాయం కింద రూ.5000, బియ్యం, నిత్యవసరాలు అందించారు. శాంతమ్మకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డిని సన్మానిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు, గ్రామపెద్దలు

## రిజిస్ట్రార్ ఆఫీస్ సిబ్బందికి సన్మానం

కొల్లిపర, మే 19 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర రిజిస్ట్రేషన్ కార్యాలయంకు ఐఎస్‌వో గుర్తింపు వచ్చిన సందర్భంగా రిజిస్ట్రార్‌ను, సిబ్బందిని డాక్యుమెంట్ రైటర్లు, గ్రామపెద్దలు సోమవారం సన్మానించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రిజిస్ట్రార్ ఆఫీసుల్లో మండల కేంద్రం కొల్లిపర సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రికార్డులకు భద్రతా ప్రమాణాలు పెంచడం, రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే దస్తావేజును ప్రజలకు అందించడం, రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చే ప్రజల కోసం వెయిటింగ్ రూమ్, బాత్రూమ్, తాగునీటి సౌకర్యంతో పాటు గార్డెన్‌ను ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడంతో ఐఎస్‌వో గుర్తింపు వచ్చింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డిని, రిజిస్ట్రార్ ఆఫీసు సిబ్బందిని డాక్యుమెంట్ రైటర్లు, గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు తమ్మా బసవపున్నారెడ్డి, బి.గంగాధర్, ఆరిమండ కోటిరెడ్డి, రమణశర్మ గ్రామ పెద్దలు మాధవరెడ్డి, సుజారావు, ఎ.సాంబిరెడ్డి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు పొన్నగంటి మృతి



పొన్నగంటి సుబ్బారావు ఫైల్‌ఫోటో

పొన్నూరు టౌన్, మే, 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, సాగునీటి సంఘాల మాజీ అధ్యక్షుడు పొన్నగంటి సుబ్బారావు (70) సోమవారం మృతి చెందాడు. సుబ్బారావు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నిడుబ్రోలులో క్రియాశీలకంగా పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించారు. మాజీమంత్రి ధూళిపాళ్ల వీరయ్యచౌదరి అనుచరుడిగా వ్యవహరించిన సుబ్బారావు తదనంతర కాలంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు తోడునీడగా నిలిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బారావు సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుబ్బారావు మృతివార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సుబ్బారావు కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి, సంతాపం తెలియజేశారు. సుబ్బారావు మరణం తనను తీవ్రంగా కలచివేసిందని నరేంద్రకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తనకు, తన కుటుంబానికి అత్యంత ఆప్తుడైన సుబ్బారావు టీడీపీకి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆయన మృతి వ్యక్తిగతంగా తనకు తెలుగుదేశం పార్టీకి తీరని లోటన్నారు. సుబ్బారావు మృతివార్త తెలుసుకున్న పొన్నూరు, నిడుబ్రోలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ పతాకాన్ని సుబ్బారావు మృతదేహానికి కప్పి నివాళులర్పించారు. బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య సుబ్బారావు అంత్యక్రియలు ముగిశాయి.

## నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా

● సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివారు ప్రాంతాలలో నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక పినపాడు, శాంతినగర్, మల్లెపాడులో త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తమ సిబ్బందితో డ్రోన్ కెమెరాల ద్వారా పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నేర నియంత్రణకు డ్రోన్ కెమారాలను కూడా వినియోగిస్తున్నామన్నారు. శివారు ప్రాంతాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే ఈ కెమెరాల ద్వారా వారి కదలికలను కనుగొనటం జరుగుతుందని, వారిని అదుపులోకి తీసుకొని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎన్ ప్రకాష్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## యువతిపై దాడి

తెనాలి, మారీసుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): యువతిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మల్లిపాడుకు చెందిన కొండమూది సురేష్ తన భార్య కుమార్తె స్వర్ణతో నివసిస్తున్నాడు. స్వర్ణ ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దనే ఉంటుంది. అదే ప్రాంతంలో నివసించే షేక్ బషీర్ చికెన్ బండి నిర్వహిస్తు జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇరు కుటుంబాల మధ్య గతంలో చిన్నపాటి వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం స్వర్ణ ఒంటరిగా ఉన్న సమయంలో బషీర్ ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

## ప్రతి దరఖాస్తును పరిష్కరించాలి: ఎంపీడీవో

కొల్లిపర, మే 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర, వల్లభాపురం సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. సచివాయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని లేకపోతే తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. అంతే కాకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అలకనంద, మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిదాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య

సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివసాంబిరెడ్డి తదితరులు

తెనాలిరూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా మండలంలోని గుడివాడలో ఉపాధి పథకం కూలీలతో కలిసి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిగా ఆంధ్రప్రదేశ్‌లో కూలి దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయకార్మికసంఘం స్థాపించారని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర కావాలని కోరుతూ 1936లో అఖిలభారత కిసాన్ సభకు ఆయన జాతీయ సహాయ కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. పిల్లలు పుడితే తనలో స్వార్థం పెరుగుతుందేమోనన్న ఆలోచనతో సంతానం వద్దనుకుని ప్రజాసేవలో అంకితమైన మహనీయుడు సుందరయ్య అని కొనియాడారు. పార్లమెంటుకు, శాసనసభకు, సైకిల్‌పై వెళ్లిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నివాళులర్పించారు. పలువురు ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

### సుందరయ్య జీవితం ఆదర్శనీయం: సీపీఎం మండల కార్యదర్శి శివాజీ

పెదకాకాని, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం పెదకాకాని మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. సోమవారం పెదకాకాని సీఐటీయూ కార్యాలయంలో జి.రాజారమేష్ అధ్యక్షతన జరిగిన సుందరయ్య వర్ధంతి సభలో నన్నపనేని శివాజీ మాట్లాడుతూ సుందరయ్య లాంటి వ్యక్తులు చాలా అరుదుగా జన్మిస్తారని అన్నారు. పిల్లలు పుడితే ప్రజల కోసం పని చేయడానికి అవరోధంగా ఉంటుందని తానే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారన్నారు. పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్ళేవారని, ప్రజల సమస్యలను పూర్తిగా అధ్యయనం చేసి వెళ్ళేవారని అన్నారు. సుందరయ్య ఏ ప్రశ్న వేస్తారోనని అధికార పక్షం భయపడేదని అన్నారు. పేదలకోసం పక్క టౌన్‌కు వెళ్ళి సరుకులు తీసుకువచ్చి అసలు ధరకు అందచేసే వారని అన్నారు. కుల నిర్మూలన కోసం పేదల కోసం, ఇండ్ల స్థలాల కోసం పోరాటాలు చేశారన్నారు. సుందరయ్య తన ఆస్తిని పేదలకు పంచిపెట్టారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించిన నాయకులలో సుందరయ్య ముఖ్యుడన్నారు. ఆయన తన జీవితాన్ని కమ్యూనిస్టు గానే గడిపారని, నిబద్ధత, నిరాడంబరంగా ఉండేవారన్నారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు కే సత్యనారాయణ, యు.శివయ్య, బి.సాంబయ్య, ఎస్.నేలాంబరం, కే.రామయ్య, సుందరయ్య కాలనీ వాసులు జె.రాజలక్ష్మి, కె పానకాలు, ఎం.వెంకాయమ్మ, ఏ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పొన్నూరులో...

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే 19 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ చేబ్రోలులో జరిగిన వర్ధంతి సభలో మాట్లాడుతూ సుందరయ్య సాయుధ పోరాటం, కార్మిక రైతాంగ పోరాటాల వివరాలను మననం చేశారు. అలాగే పోలిశెట్టి కోటేశ్వరరావు 9వ వర్ధంతిని నిర్వహించారు. పొన్నూరు సీఐటీయూ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి నిర్వహించి ఘన నివాళులర్పించారు.




పెదకాకాని: సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు శివాజీ తదితరులు

## గ్రంథాలయంలో శాస్త్ర ప్రయోగాలపై మెళకువలు

తెనాలి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నెహ్రూరోడ్డులోని గ్రంథాలయంలో బాల బాలికలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. సోమవారం శాస్త్ర ప్రయోగాలపై మెళకువలను సైన్స్ ఉపాధ్యాయుడు శివనాగేశ్వరరావు వివరించారు. శాస్త్ర ప్రయోగాలపై ఆసక్తి పెంచుకుంటే శాస్త్రవేత్తలు కావచ్చునని దేశానికి మంచి చేయవచ్చునని చెప్పారు. విశ్రాంత లైబ్రేరియన్ మొవ్వా సుబ్బారావు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. అహ్మద్ హుస్సేన్, బొల్లిముంత కృష్ణ, పాటలు నేర్పించారు. గ్రంథాలయ పర్యవేక్షకురాలు లావణ్యసుధ తదితరులు పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వెంకటేష్‌కు రజతం

పొన్నూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని పీబీఎన్ కళాశాలకు చెందిన విద్యార్థి సీహెచ్ వెంకటేష్ ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించి సత్తాచాటాడు. ఈ నెల 14 వరకు బీహార్‌లో జరిగి ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 89 కిలోల విభాగంలో స్నాచ్ 117కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 155 కిలోలు మొత్తం 272కిలోల బరువును ఎత్తి ద్వితీయస్థానంలో నిలిచి వెంకటేష్ రజత పతకం సాధించాడు. జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపుతున్న వెంకటేష్‌ను పీబీఎన్ కళాశాల అధ్యక్షుడు కెప్టెన్ ఎన్.అంకమ్మ చౌదరి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకాంత్, కోఆర్డినేటర్ డాక్టర్ చిత్తరంజన్, పీడీ కె భానుప్రసాద్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన పీబీఎన్ విద్యార్థి వెంకటేష్